


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ | 25-03-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 310 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on

# మత మార్పిడితో ఎస్సీ హోదా, రక్షణ రద్దు

● హిందు, సిక్కు, బౌద్ధ మతాలు మినహా ఇతర ఏ మతంలోకి మారినా ఎస్సి, ఎస్టి చట్ట భద్రత వర్తించదు ● ఏపీ హైకోర్టు తీర్పుకి సుప్రీంకోర్టు ఓకె



**న్యూఢిల్లీ :** ఎస్సీ కులానికి చెందిన వారు మతం మారితే ఎస్సి హోదా రద్దు అవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోకి కాకుండా ఇతర ఏ మతంలోకి మారినా వారి ఎస్సి హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. గతంలో ఏపీ హైకోర్టు జరిగిన విచారణలో.. క్రైస్తవ మతంలోకి మారిన పాస్టర్ ఎస్సి, ఎస్టి చట్టం కింద రక్షణ పొందలేరని సుప్రీం న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ వారు సుప్రీం కోర్టును ఆశ్రయించగా..

మిగతా 2లో



# ట్రంప్, మోడీ సంభాషణ

## పశ్చిమాసియా సంక్షోభం గురించి మాట్లాడుకున్న అగ్రనేతలు

● హోర్ముజ్ జలసంధిని తెరిపించే అవసరంపై మంతనాలు ● మోడీ ట్రంప్‌తో మాట్లాడినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్'లో పోస్టు

**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం) :** ప్రపంచ వాణిజ్యం కోసం హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచాల్సిన అవసరం సహా పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభంపై యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీతో మంగళవారం చర్చించారు. కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య ఇద్దరు నాయకులూ ఆ ప్రాంతంలోని భద్రతా పరిస్థితిని సమీక్షించడమే కాక నిరంతరాయ ఇంధన సరఫరాలను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మధ్యప్రాచ్యంలో తీవ్రమవుతున్న పరిస్థితులపై, ముఖ్యంగా ప్రపంచ ఇంధన మార్గాల్లో స్థిరత్వాన్ని కాపాడుకోవడంపై చర్చించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడారని భారతదేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్‌పై ఒక పోస్ట్‌లో తెలిపారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడే ప్రధాన మంత్రి మోదీతో మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచాల్సిన ప్రాముఖ్యతతో సహా, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న పరిస్థితిపై వారు చర్చించారు, అని ఆయన పేర్కొన్నారు.

### ఇరాన్‌పై ఇంకా దాడులు

**వుదయం డెస్క్, మార్చి 24 :** సంఘర్షణకు ముగింపు పలకడానికి తెహ్రాన్‌తో తాము చర్చలు జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ, ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఈ ప్రకటన తర్వాత, మంగళవారం రాత్రి ఇరాన్‌లోని పలు నగరాలపై అమెరికా–ఇజ్రాయెల్

మిగతా 2లో

# కాంగ్రెస్‌ను వీడుతున్నట్టే !

## నేడో, రేపో రాజీనామా చేయనున్న జీవన్‌రెడ్డి

● ఫలించని ఏఐసీసీ బుజ్జగింపులు ● జీవన్ రెడ్డి నివాసానికి పార్టీ రాష్ట్ర చీఫ్, మంత్రులు ● సుదీర్ఘంగా బుజ్జగింపు ● కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు జీవన్‌రెడ్డి నిరాకరణ ● ఇంట్లో, బయట ఇందిరమ్మ ఫ్లెక్సీల తొలగింపు



**జగిత్యాల, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ నేత, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఎట్టకేలకు పార్టీని వీడేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే పార్టీ హైకమాండ్ రంగంలోకి దిగి జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. తాజాగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ రంగంలోకి దిగినా జీవన్ రెడ్డి వెనక్కి తగ్గడం లేదు. పార్టీ నుంచి వెళ్లిపోవాలనే ఆయన డిసైడ్ అయినట్లు అర్థం అవుతోంది. మంగళవారం జగిత్యాలకు వెళ్లి జీవన్‌రెడ్డితో భేటీ అయిన పీసీసీ చీఫ్.. పార్టీలోనే కొనసాగాలని.. కాంగ్రెస్‌ను వీడొద్దని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ జీవన్ రెడ్డి మాత్రం ససేమిరా వెనక్కి తగ్గలేదని తెలుస్తోంది.

మిగతా 2లో

# తగినన్ని చమురు నిల్వలు

## 41 దేశాల నుంచి దిగుమతులు, గృహావసరాలకు గ్యాస్ సరఫరాలు పెంచుతున్నాం
## గల్ఫ్ నుంచి 3.75 లక్షల భారతీయులను సురక్షితంగా తీసుకువచ్చాం : రాజ్యసభలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం) :** పశ్చిమాసియాలో పరిణామాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం రాజ్యసభలో ప్రసంగించారు. సోమవారంనాడు లోక్‌సభలో ప్రసంగించిన ఆయన, మరురోజే పెద్దల సభలో మాట్లాడారు. ఈ సంక్షోభం నడుమ భారత్ వద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉండటమే కాక ఆరోగ్యవంతమైన సరఫరా ఏర్పాట్లు ఉన్నాయని ఆయన సభకు తెలిపారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను, శుద్ధి సామర్థ్యాన్ని విస్తరించామని, సంక్షోభం నడుమ చోటు చేసుకుంటున్న అంతరాయల నుంచి దేశాన్ని కాపాడేందుకు ఇంధన దిగుమతులు ఇప్పుడు 41 దేశాల నుంచి వస్తున్నాయని, దేశీయ గ్యాస్, ఎరువుల సరఫరాలను బలోపేతం చేస్తున్నామని ప్రధాని వివరించారు.
గల్ఫ్ దేశాల్లోని భారతీయులు యుద్ధ సంక్షోభంలో చిక్కుకున్నారని ప్రధాని తెలిపారు. ఆయా దేశాల్లో కోటి మందికి పైగా భారతీయ కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. గల్ఫ్ దేశాల నుంచి 3.75 లక్షల మందిని సురక్షితంగా భారతదేశానికి తీసుకువచ్చామని అన్నారు. భారతీయుల రక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామని తెలిపారు. మన ముందు చాలా సవాళ్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.
అర్థిక వ్యవస్థకు ఇంధనమే వెన్నెముక...

మిగతా 2లో



భారత విదేశాంగ విధానం ప్రధాని వ్యక్తిగత విషయం అయిపోయింది. ఆయన అమెరికా ఇజ్రాయిల్ చెప్పినట్లే చేస్తారు: ప్రతిపక్ష నేత రాహుల్

5

## సాదాబైనామాలకు త్వరలో మోక్షం



● కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే సరిపోతుంది
● దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76
● శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

## మరి 8 ఏళ్లు రాష్ట్ర రాజకీయాల్లోనే

ఢిల్లీలో ఓ ఛానల్ డిబేట్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

కేంద్రంలో దక్షిణాదికి దక్కని కీలక పదవులు



**న్యూఢిల్లీ :** తాను మరో ఎనిమిదేళ్ల పాటు తెలంగాణలో రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ తర్వాత దేశ రాజకీయాల అరంగేట్రం గురించి ఆలోచిస్తానని చెప్పారు. ఒకవేళ భవిష్యత్తులో దేశ రాజకీయాలకు తాను అవసరమని పార్టీ భావిస్తే, ఆ నిర్ణయాన్ని హైకమాండ్‌కే వదిలేస్తున్నానని చెప్పారు. దేశంలోనే తెలంగాణ డీఎన్‌ఏ భిన్నమైందన్న ఆయన ఇదొక వైబ్రెంట్ ప్లేస్ అని కొనియాడారు. తెలంగాణకు, గాంధీ కుటుంబానికి ఉన్న ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. తాను ఒక నాయకుడిలా కాకుండా, కార్యకర్తగానే భావిస్తానని, వారి కష్టనష్టాలు తనకు తెలుసని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో ఓ మీడియా ఛానెల్ డిబెట్ లో సీఎం మాట్లాడారు.

మిగతా 2లో

## సర్వర్లు మొరాయించడంతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందని సేవలు

రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి పడిగాపులు

మధ్యాహ్నం తర్వాత సేవలు పునఃప్రారంభం




**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** మొరాయించిన సర్వర్లతో రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు గంటల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనులు సాగ లేదు. దీంతో స్లాట్ బుకింగ్ చేసుకుని.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు.. గంటల తరబడి ఆఫీసుల ముందు పడిగాపులు కాశారు. మంగళవారం ఉదయం నుంచే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సర్వర్లు

మిగతా 2లో

## పీజీ మెడికల్ కౌన్సెలింగ్ గడువును పెంచలేం

మీ సమస్యలను జాతీయ మెడికల్ కమిషన్‌కు చెప్పుకోవచ్చు
ప్రైవేటు వైద్య కళాశాలకు సుప్రీం వెసులుబాటు



**న్యూఢిల్లీ :** తెలుగు రాష్ట్రాల్లోని పీజీ వైద్య విద్యార్థులకు, ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. పీజీ మెడికల్ సీట్ల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్ గడువును పెంచేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించాలని దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇప్పటికే అనేక విడతలుగా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయినందున, ఇకపై సమయాన్ని పొడిగించడం సాధ్యం కాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసుపై మంగళవారం విచారణ చేపట్టిన దేశ అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే ఏడుసార్లు కౌన్సెలింగ్ నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసింది. ఇన్ని అవకాశాలు కల్పించిన తర్వాత కూడా ఇంకా గడువు పెంచాలని కోరడం సమంజసం కాదని అభిప్రాయపడింది. విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. జాతీయ మెడికల్ కమిషన్ కోర్టుకు సమర్పించిన వివరాలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా మెడికల్ సీట్లు మిగిలిపోవడం సహజమని, దీని కోసం నిరంతరం గడువు పెంచడం కుదరదని ఎన్ఎంసీ స్పష్టంచేసింది. మిగిలిపోయిన సీట్లలో అత్యధికం ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోనే ఉన్నాయని, ప్రభుత్వ కోటా సీట్లు దాదాపు భర్తీ అయ్యాయని కమిషన్ వివరించింది. ఈ నేపథ్యంలో గడువు పొడిగింపు అవసరం లేదని...

మిగతా 2లో

# త్వరలో డీలిమిటేషన్

● లోక్ సభ స్థానాలు 816కు పెంపు ● దేశంలో 6085కి పెరగనున్న శాసనసభ స్థానాలు
● రాష్ట్రంలో అదనంగా 60 అసెంబ్లీ స్థానాలు ● మహిళలకు ఎక్కువ సీట్లు

**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బిల్లు అమలైతే లోక్‌సభ స్థానాలు 816కి, అసెంబ్లీ స్థానాలు 6,185కి పెరుగుతాయి. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ సీట్లను 50 శాతం మేర పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ప్రతిపాదన అమలైతే,

మిగతా 2లో

## ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం



● ఆరు గ్యారంటీలపై బిల్లు పెడుతున్నాం ● ఆ భయంతోనే హడావిడిగా నాపై ఈ కార్ రేస్ చార్జిషీట్ ● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై తాము బిల్లు పెడుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హడావుడిగా తనపై ఫార్ములా–ఈ రేస్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అక్రమ కేసు అని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'చిట్ చాట్'లో ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

మిగతా 2లో

## నాకు మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వానికే మంచిది

మీడియాతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఏ పదవి లేకపోయినా ప్రజల్లో తనకు ఎనలేని ఆదరణ, గౌరవం ఉందన్నారు, తనకు మంత్రి పదవి ఇస్తే అది వ్యక్తిగతంగా తనకంటే కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వానికే మంచి పేరు తెస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రి పదవి విషయంలో గతంలో అధిష్టానం తనకు హామీ ఇచ్చిందన్న ఆయన అధిష్టానం ఇప్పుడు ఏం చేస్తుందో తనకు తెలియదన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తనలాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు పార్టీకి చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. కేడర్‌లో పట్టున్న నేతలను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పరోక్షంగా గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి ఇబ్బందులు లేవని రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఈ నెల 23న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ ఏదీ జరగలేదన్న ఆయన అసెంబ్లీలో ఎదురుపడినప్పుడు కేవలం మర్యాదపూర్వకంగా పలకరించుకున్నామని తెలిపారు. మంగళవారం అసెంబ్లీ డైనింగ్ హాల్‌లో కేటీఆర్‌తో జరిపిన సుదీర్ఘ భేటీపై స్పందించిన ఆయన అది కేవలం సాధారణ సంభాషణ మాత్రమేనని చెప్పారు. అయితే, ఆ చర్చల్లో గత రాజకీయ పరిణామాలను

మిగతా 2లో

# పీజీ మెడికల్ కౌన్సెలింగ్ గడువును పెంచలేం

**మొదటి పేజీ తరువాయి..**

ఎన్ఎంసీ గట్టిగా వాదించింది. కళాశాలలకు చిన్న ఊరట గడువు పెంచేందుకు నిరాకరించినప్పటికీ, ప్రైవేట్ వైద్య కళాశాలలకు కోర్టు ఒక చిన్న అవకాశం కల్పించింది. తమ సమస్యలను జాతీయ మెడికల్ కమిషన్ కమిటీ ముందు చెప్పుకునేందుకు ధర్మాసనం అనుమతించింది. ఇప్పటికే కమిటీని ఆశ్రయించి ఉంటే, దానిపై నిర్ణయం తీసుకునే పూర్తి స్వేచ్ఛ ఎన్ఎంసీ కమిటీకే ఉంటుందని కోర్టు తెలిపింది. ఇప్పటివరకు కమిటీని సంప్రదించని పక్షంలో, ఇప్పుడు వెళ్లి తమ విన్నపాలను సమర్పించుకోవచ్చని ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు తాజాగా వెల్లడించిన నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోని పీజీ మెడికల్ కౌన్సెలింగ్ ప్రక్రియకు దాదాపు తెరపడినట్లయింది.

# నాకు మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వానికే మంచిది

**మొదటి పేజీ తరువాయి..**

ప్రస్తావించినట్లు చెప్పుకొచ్చారు. "2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 88 సీట్లు వచ్చినప్పటికీ, 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం మీరు చేసిన అతిపెద్ద తప్పు అని కేటీఆర్‌కు చెప్పాను," అని రాజగోపాల్ రెడ్డి వివరించారు. అంతకు ముందు అసెంబ్లీ డైనింగ్ హాల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఒకే టేబుల్‌పై కూర్చుని లంచ్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా ప్రజాప్రతినిధులు డైనింగ్ హాల్‌లో కలిసి భోజనం చేయడం సహజమే అయినప్పటికీ, ఈ ముగ్గురు నేతల భేటీ మాత్రం ప్రత్యేకత సంతరించుకుంది. భోజనం పూర్తయిన తర్వాత కూడా వారు అక్కడే ఉండి దాదాపు రెండు గంటల పాటు ఏకాంతంగా చర్చలు జరపడం ఆసక్తి రేకెత్తించింది.

# ఇరాన్‌పై కొనసాగుతున్న దాడులు

**వుదయం డెస్క్, మార్చి 24 :** సంఘర్షణకు ముగింపు పలకడానికి టెహ్రాన్‌తో తాము చర్చలు జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ, ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఈ ప్రకటన తర్వాత, మంగళవారం రాత్రి ఇరాన్‌లోని పలు నగరాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు జరిగాయి. టెహ్రాన్, ఇతర కీలక ప్రదేశాలలో పేలుళ్లు సంభవించినట్లు వార్తలు రాగా, గ్యాస్ కేంద్రాలు, పైప్‌లైన్‌లకు కూడా నష్టం వాటిల్లిందని ఇరాన్ అధికారులు తెలిపారు. పెరుగుతున్న ప్రాంతీయ ఉద్రిక్తతలు, చర్చల సాధ్యత, అనిశ్చితి, ప్రపంచ ఇంధన సరఫరాలు, గల్ఫ్ ప్రాంత భద్రతపై ఈ సంఘర్షణ ప్రభావం గురించి పెరుగుతున్న ఆందోళనల మధ్య ఈ దాడులు కొనసాగుతున్నాయి.



**నగరాలపై దాడులు**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు సంభవించాయని, అలాగే తబ్రిజ్, ఇస్ఫహాన్, కరాజ్‌లపై కూడా దాడులు జరిగాయని ఇరాన్ మీడియా నివేదికలు తెలిపాయి. విద్యుత్ మౌలిక సదుపాయాలపై జరగాల్సిన దాడులు వాయిదా పడ్డాయని వార్తలు వచ్చిన కొన్ని గంటల తర్వాత, మధ్య ఇరాన్‌లోని రెండు గ్యాస్ కేంద్రాలు, ఒక పైప్‌లైన్‌పై ఇజ్రాయెల్ అమెరికా దాడులు జరిగాయని ఫార్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. నైరుతి ఇరాన్‌లోని ఖొర్రమ్‌షహర్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాసెసింగ్ యూనిట్ సమీపంలో ఒక క్షిపణి పడిందని, సరిహద్దు నగర గవర్నర్‌ను ఉటంకిస్తూ ఆ ఏజెన్సీ తెలిపింది. టెహ్రాన్‌కు ఉత్తరాన ఉన్న తన నివాసంపై దాడి జరగడంతో, ఇరాన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ సయీద్ షమఘ్దారీ తన ఇద్దరు పిల్లలతో పాటు మరణించారని స్థానిక నివేదికలు తెలిపాయి. ఆయుధాల అభివృద్ధికి ఇరాన్ విద్యావేత్తలకు సంబంధాలు ఉన్నాయని ఇజ్రాయెల్ గతంలో ఆరోపించింది.

**సంఘర్షణ తీవ్రమవుతున్న తరుణంలో చర్చలపై అస్పష్టత**

దౌత్య సంకేతాలు అనిశ్చితంగా ఉన్న తరుణంలో ఈ దాడులు జరిగాయి. నివేదికల ప్రకారం, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి గత 24 గంటల్లో ఈజిప్ట్, ఒమన్‌లోని అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. అయితే, చర్చలు చాలా ఫలవంతమయ్యాయి అని ట్రంప్ చెప్పినప్పటికీ, అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరగడాన్ని ఇరాన్ ఉన్నతాధికారులు ఖండించారు. చర్చలకు దిగే ముందు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, గతంలో చర్చలు జరుగుతున్నాయన్న వాదనలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని ఇరాన్ చట్టసభ సభ్యుడు ఇస్మాయిల్ కౌసరి హెచ్చరించినట్లు నివేదికలు తెలిపాయి. ఈ ఘర్షణ విస్తృత మధ్యప్రాచ్యం అంతటా వ్యాపించడంతో, చమురు ధరలు పెరిగడంతో పాటు ప్రపంచ ఇంధన సంక్షోభం భయాలు పెరిగాయి. తూర్పు ప్రావిన్స్‌ను లక్ష్యంగా చేసుకున్న 19 డ్రోన్‌లను తమ వాయు రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని సౌదీ అరేబియా చెప్పగా, రాత్రిపూట పలు క్షిపణి, డ్రోన్ హెచ్చరికలు అందినట్లు, తెల్లవారుజాము వరకు సైరన్‌లు పదేపదే మోగినట్లు కువైట్ నివేదించినట్లు ప్రాంతీయ నివేదికలు పేర్కొన్నాయి.

# సర్వర్లు మొరాయించడంతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం

**మొదటి పేజీ తరువాయి**

పనిచేయకుండా పోయాయి. ఫలితంగా తెలంగాణలో భూములు, ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. స్లాట్ బుకింగ్‌లు, చలాన్ల చెల్లింపులు కూడా ఆగిపోయాయి. ఈ క్రమంలోనే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి బదిలీ చేసేందుకు కార్యాలయాలకు వచ్చిన కొందరు నిరాశతో వెనుదిరిగి ఇంటికి వెళ్లారు. మరికొందరు సేవలు ప్రారంభమయ్యే వరకు అక్కడే వేచి చూశారు. కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను జనం నిలదీశారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లోని సర్వర్లలో సాంకేతిక లోపాలు తలెత్తడంతోనే ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయినట్లు సంబంధిత అధికారులు చెప్పినా వినకుండా వారితో వాగ్వాదానికి దిగారు. ఉదయం ఆఫీసులు ప్రారంభం అయినప్పటి నుంచే సర్వర్లు మొరాయించడంతో భూముల క్రయ, విక్రయాలు నిలిచిపోయి.. వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఈ కేవైసీ సహా రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏ పనీ సాగలేదు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్లు బుక్ చేసుకుని.. కొనుగోలుదారులు, అమ్మకందారులు సాక్షులతో సహా రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి ఉదయం నుంచి పడిగాపులు కాశారు. మరోవైపు.. దూర ప్రాంతాల నుంచి ఆఫీసులకు వచ్చిన వారు సర్వర్లు ఎప్పుడు పని చేస్తాయి.. తమ పని ఎప్పుడు అవుతుందో తెలియక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రిజిస్ట్రేషన్ల శాఖ మెయిన్ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయినట్లు గుర్తించిన అధికారులు.. టెక్నికల్ టీమ్‌లను రంగంలోకి దించారు. సర్వర్ మొరాయింపులను సరి చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో తిరిగి సేవలను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

# మత మార్పిడితో ఎస్‌సి హోదా, రక్షణ రద్దు

**మొదటి పేజీ తరువాయి**

ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు సుప్రీంకోర్టు మద్దతుగా నిలిచింది.

**అసలు కేసు ఇది..**

గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెంలో ఒక పాస్టర్‌పై జరిగిన దాడికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించినట్లు కోర్టు గుర్తించింది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదు చేసే హక్కు ఉండదని కోర్టు స్పష్టం చేసింది. దాడి జరిగిన సమయంలోనూ సదరు వ్యక్తి ప్రార్థనలు చేస్తున్నట్లు గుర్తించిన కోర్టు, ఈ వ్యాఖ్యలు చేసింది. తహశీల్దార్ ఇచ్చిన ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఆ చట్టపరమైన రక్షణ పొందేందుకు సదరు వ్యక్తికి అర్హత ఉండదని కోర్టు





పేర్కొంది. రాజ్యాంగంలోని 341 అధికరణ ప్రకారం, ఎస్‌సి హోదా కేవలం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే వారికి మాత్రమే పరిమితం చేయబడింది. మత మార్పిడి ద్వారా క్రైస్తవం, ఇస్లాం మతాన్ని స్వీకరించినప్పుడు సహజంగానే ఎస్‌సి హోదా రద్దవుతుందని, తద్వారా అట్రాసిటీ చట్టం వర్తించదని హైకోర్టు ఈ కేసులో వ్యాఖ్యానించింది. ఈ తీర్పును సవాల్ చేసి సుప్రీంకి వెళ్లిన ఫాస్టర్‌కు అక్కడ కూడా చేదు అనుభవం ఎదురైంది.

# తగినన్ని చమురు నిల్వలు

**మొదటి పేజీ తరువాయి**

అని, ఇంధన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని చెప్పారు. గృహావసరాలకు సరిపడా ఎల్పీజీ సరఫరా పెంచుతున్నామని చెప్పారు. 41 దేశాల నుంచి పెట్రో ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటున్నామని, 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ప్రభావం పడిందన్నారు. శత్రుత్వం వీడి, ఉద్రిక్తతలకు తగ్గించేందుకు కృషి చేయాలని అన్ని పక్షాల వారిని భారత్




కోరుతోంది. భారత్‌పై కూడా యుద్ధం ప్రభావం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ దశలో పెద్దల సభ ఏకగ్రీవంగా శాంతి, చర్చల సందేశాన్ని ఇవ్వడం ముఖ్యమని పేర్కొన్నారు.

# ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం

**మొదటి పేజీ తరువాయి..**

ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, ఇందులో అంగుళం కూడా నిజం లేదని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ,దీనిపై తాము అసెంబ్లీలో 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ కేసులో అధికారులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. "మీకు నాపై కక్ష ఉంటే నేరుగా నాపై తీర్చుకోండి. నిర్ణయం తీసుకున్నది నేను, కాబట్టి ఏ చర్యలైనా నాపైనే ఉండాలి. అనవసరంగా అధికారులను బలి చేయడం కరెక్ట్ కాదు," అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ఫార్ములాఈ నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలను కేటీఆర్ కొట్టిపారేశారు. "ఒక్క రూపాయి కూడా దారి మళ్లలేదని స్పష్టం చేశారు. డబ్బులు నేరుగా కంపెనీకి వెళ్లాయన్నారు. అది అందరికీ కనిపిస్తోందని చెప్పారు. క్విడ్ ప్రో కో జరిగిందని చెబుతున్నారు కాంగ్రెస్ నేతలు.. మరి గ్రీన్ కో కంపెనీపై ఎందుకు కేసు పెట్టలేదో? మీడియానే ఆలోచించాలన్నారు. హైదరాబాద్ ఇమేజ్ పెంచేందుకు, పెట్టుబడులు ఆకర్షించేందుకే ఈ రేస్ నిర్వహించినట్లు వివరణ ఇచ్చారు.

దీంతో రాష్ట్రానికి ప్రయోజనం కలిగిందన్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వంపై కూడా కేటీఆర్ ఎదురుదాడి చేశారు. "ప్రభుత్వం అందాల పోటీల కోసం రూ. 200 కోట్లు ఖర్చు చేసింది. దీనివల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం చేకూరింది? ఒక మహిళా ప్రతినిధి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసినా ఎందుకు స్పందించడం లేదు?" అని ప్రశ్నించారు. మొదటి నుంచి చెబుతున్నా.. ఇది 100శాతం లొట్టపీసు కేసు. లేని కేసును ఉన్నట్లుగా మసిబూసి మారేడు కాయ చేస్తున్నారు. న్యాయపరంగా దీనిని ఎదుర్కొంటాం," అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# మరి 8 ఏళ్లు రాష్ట్ర రాజకీయాల్లోనే

**మొదటి పేజీ తరువాయి**


రాష్ట్రంలోని 'విలన్ల'తోనే ప్రజలు తనను 'హీరో'ను చేశారని సీఎం.. బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రామాయణంలో రావణుడు ఉన్నాడు కాబట్టే రాముడికి అంత పేరు వచ్చిందన్న ఆయన తెలంగాణలో గత పాలకుల తీరుతోనే కాంగ్రెస్‌కు, తనకు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ఇప్పటికీ, ఎప్పటికీ తమ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సీఎం మండిపడ్డారు. ప్రధాని మోడీ అనుసరిస్తున్న 'త్రీడీ పాలసీ'కి వ్యతిరేకంగా దక్షిణ భారతదేశం మొత్తం ఏకం కావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలో దక్షిణాది రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆయన ఆరోపించారు. వెంకయ్య



నాయుడుని రాష్ట్రపతిని చేయకుండా, కేవలం ఉపరాష్ట్రపతి పదవితో ఎందుకు సరిపెట్టారు?" అని ప్రశ్నించారు. కేంద్రంలో హోంశాఖ వంటి కీలక బాధ్యతలను దక్షిణాది నేతలకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో దక్షిణాదికి చెందిన వారు రాష్ట్రపతులుగా ఎదిగారని, రాజకీయ వివక్ష కేవలం బీజేపీలోనే కనిపిస్తోందని విమర్శించారు.

# సాదాబైనామాలకు త్వరలో మోక్షం

**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి):** రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తు లను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు..



ఎదురవుతున్నాయని చెప్పారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామన్న మంత్రి..ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.

**ఆధార్ మాదిరిగానే భూధార్:**

నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామన్నారు. ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించామని చెప్పారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లాలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దశల వారీగా భూ సర్వే నిర్వహించి భూధార్‌ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

**అవినీతికి పాల్పడితే ఎవరిని ఉపేక్షించబోము:**

ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ సేవ నిర్వాహకులతో కలిసి రూ. 3.99 కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేశారన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.

# త్వరలో డీలిమిటేషన్

**మొదటి పేజీ తరువాయి**

లోక్‌సభ స్థానాల సంఖ్య 543 నుండి 816కి పెరుగుతుంది. దేశంలోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి పెరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు వీలుగా సంబంధిత చట్టాలకు సవరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా కసరత్తు చేసి, కేంద్రం అడుగులు సైతం వేస్తోంది.

**ఏపీ, తెలంగాణలో ఎన్ని స్థానాలు..**

కేంద్రం నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాతినిధ్యం భారీగా పెరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 స్థానాలు 26కి పెరుగుతాయి. ఏపీలో అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 263, తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 119 నుండి 179కి చేరే అవకాశం ఉంది. ఈ అంశంపై ఇప్పటికే ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో పాటు విపక్షాలతోనూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో ప్రాథమిక చర్చలు జరిగాయి. 2027 మార్చి నాటికి జనగణన పూర్తి చేసి, ఆ లెక్కల ఆధారంగానే 2029 ఎన్నికల నాటికి ఈ కొత్త సీట్ల పెంపును అమలు చేయాలని మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు చేపడితే ఉత్తరాది, దక్షిణ రాష్ట్రాల మధ్య రాజకీయ ప్రాతినిధ్యంలో వ్యత్యాసం వస్తుందన్న ఆందోళన కొనసాగుతోంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం, అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు మేర పెంచాలని కొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. ఈ ప్రతిపాదనపై స్పందించేందుకు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్షాలు మంగళవారం నాడు భేటీ కానున్నాయి.

**లోక్‌సభ స్థానాలు ఏ రాష్ట్రంలో ఎన్ని..**

50 శాతం మేర లోక్‌సభ సీట్లు పెంపు జరిగితే కనుక ఎక్కువ ప్రయోజనం ఉత్తరప్రదేశ్‌కు కలుగుతుంది. యూపీలో 80 ఉన్న లోక్‌సభ సీట్లు 120 అవుతాయి. ఇందులో 40 సీట్లు మహిళలకు రిజర్వ్ చేయనున్నారు. మహారాష్ట్ర సీట్లు 48 నుండి 72కి పెరుగుతాయి. పశ్చిమ బెంగాల్ 42 నుండి 63కి, బీహార్ 40 నుండి 60కి, ఏపీలో లోక్‌సభ సీట్లు 25 నుంచి 38, తెలంగాణలో 17 నుంచి 26కి చేరతాయి. తమిళనాడులో లోక్‌సభ సీట్ల సంఖ్య 39 నుండి 59కి, మధ్యప్రదేశ్ లోక్‌సభ సీట్లు 29 నుండి 44కి పెరుగుతాయి. చిన్న రాష్ట్రాల్లో, అరుణాచల్ ప్రదేశ్, గోవా, మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల లోక్‌సభ సీట్లు 2 నుండి 3కి పెరగవచ్చు. ప్రస్తుతం ఒక్కో సీటు ఉన్న మిజోరం, నాగాలాండ్, సిక్కిం రాష్ట్రాలకు 2 సీట్లు చొప్పున వచ్చే అవకాశం ఉంది. కేంద్రపాలిత ప్రాంతాలలో ఢిల్లీలో లోక్‌సభ సీట్లు 7 నుండి 11కి, జమ్మూ కాశ్మీర్ సీట్లు 5 నుండి 8కి పెరుగుతాయి. లడఖ్, పుదుచ్చేరి వంటి ఒకే సీటు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలలో సీట్ల సంఖ్య పెరుగుతుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు.

**2029 ఎన్నికల నుంచే మార్పులు చేర్పులు..**

2023 సెప్టెంబరులో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2034 నుండి అమల్లోకి రావాలి. రాజ్యాంగంలోని అధికరణలు 170(3), 81(3) నిబంధనల మేరకు, 2026 తర్వాత వెలువడే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. అయితే, తాజా పరిణామాల ప్రకారం 2027 మార్చి 1 నాటికి జనగణన ప్రక్రియ పూర్తి కానుంది. వెంటనే నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టే అవకాశం ఉంది. తద్వారా రిజర్వేషన్ల అమలును అనుకున్నదానికంటే ముందే పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను ప్రారంభించింది.

# సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమే సర్కార్ లక్ష్యం

## అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి)**

ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే తమ ప్రభుత్వ పరిపాలన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. వాటి చుట్టే తమ ప్రభుత్వ ఆలోచనలు తిరుగుతాయని చెప్పారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన అడుగుజాడల్లోనే నడుస్తూ రాష్ట్రంలో పాలన సాగిస్తున్నామన్న ఆయన తాము పాలకులం కాదు, ప్రజలకు సేవకులం అన్నారు. ప్రజలు తమకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకుపోతున్నామని వెల్లడించారు. మభ్యపెట్టే మాయమాటలు చెప్పడం... ప్రశ్నించే వారిని దూషించడం తమ నైజం కాదని స్పష్టం చేశారు. బాధ్యతతో ఎవరు ప్రశ్నించినా... బాధ్యతతోనే వారికి సమాధానం చెబుతామని వ్యాఖ్యానించారు. అది ప్రజల పట్ల, ప్రజాస్వామ్యం పట్ల తమకున్న చిత్తశుద్ధి అని అభివర్ణించారు. మంగళవారం రాత్రి అసెంబ్లీలో మాట్లాడిన భట్టి... విపక్ష సభ్యుల తీరుపై మండిపడ్డారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి బీఆర్ఎస్ నేతలకు ఇష్టం ఉండదన్నారు. ఇది తరతరాలుగా వస్తున్న సమస్య అన్న ఆయన ప్రతిపక్ష నేతలు ఇంకా ఆ సమస్య నుంచి బయటపడటం లేదని చురకలంటించారు. ప్రభుత్వ ఉద్యోగ కుటుంబ పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబం ఉగాదంలోకి వెళ్లొదని తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి నిర్ణయాన్ని గ్రామస్థాయికి తీసుకువెళ్లే ఉద్యోగస్తుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా వారికి రూ. 1.20 కోట్ల ప్రమాద బీమాను ప్రవేశపెట్టామని చెప్పారు. మొత్తం 7.50 లక్షల కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు వివరించారు. పదేండ్లు ప్రతిపక్షంగా కూర్చున్న తనకు జరిగిన అవమానాలు ఏంటో రికార్డులు చూస్తే స్పష్టంగా తెలుస్తుందన్నారు. ప్రజల సమస్యలపై అరిచిపెట్టిన తనకు బీఆర్ఎస్ సర్కార్ కనీసం మైక్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యంపై వారికున్న గౌరవం నమ్మకం అని సెటైర్లు వేశారు. ప్రతి ప్రశ్నకు సమాధానం, ప్రతి అంశానికి వివరణ ఇస్తాం అన్నవారికి వినే ఓపిక లేకుండా వెళ్ళిపోయారని



విమర్శించారు. పదేండ్లలో తమను సభ్యులుగా గౌరవించలేదనీ అయినా తాము అర్ధరాత్రి రెండు గంటల వరకు ఓపికగా ఉన్నామే తప్ప ఏనాడూ వాకౌట్ చేయలేదన్నారు. అవకాశం ఇవ్వలేదని వెల్లోకి వెళ్లలేదు ఓపికగా సభలో ఉన్నామని చెప్పారు. కోట్లాది ప్రజల జీవనస్థితిగతులను మార్చాలన్న ఆలోచనతో ఇక్కడికి వచ్చామన్న భట్టి.. ఎన్నికల తర్వాత మీరు అటు మేము ఇటు కూర్చుంటామని చెప్పాము అలాగే జరిగిందన్నారు. లక్షలాది మంది పేద విద్యార్థుల ఆకలిని అర్థం చేసుకున్న వ్యక్తులుగా ఈ బిడ్డ ఖాళీ కడుపుతో బడికి పోవద్దన్న ఆలోచనతో అల్పాహారం ప్రవేశపెట్టినట్లు డిప్యూటీ సీఎం వివరించారు. బడి నడిచిన ఆరు రోజుల్లో మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావా ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇంటర్ పిల్లలకు మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామన్న భట్టి... వాళ్లు భోజనం చేయాలో వద్దో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ఇలా మత ప్రాంత భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు 5 లక్షల ప్రమాద బీమా కల్పించినట్లు చెప్పారు.

**వివరణ వినే ఓపికా ప్రతిపక్ష సభ్యులకు లేదు**

తాము ఎన్ని కార్యక్రమాలు చేపడుతూ ఉంటే వినే ఓపిక ప్రతిపక్ష సభ్యులకు లేకపోవడం తమకు ఆవేదన కలిగించిందన్నారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడిన అన్ని విషయాలను నమోదు చేసుకున్నామన్న డిప్యూటీ సీఎం.. సమాధానం ఇవ్వడానికి ముందుకు వచ్చామన్నారు. అయినా బడ్జెట్ కాగితాలను చించి చెవిలో పెట్టుకుని వెళ్లిపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ సభ నాయకుడు ఎలాగు సభకు రారనీ ఆయనకు సభపై ఎలాగూ గౌరవం లేదన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ టీఆర్ఎస్ నేతలకు కంటగింపుగా ఉందా? అని నిలదీశారు. తాము బడ్జెట్ పై వివరణ ఇస్తే వారు వినకూడదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసమే ఈ సభ ఉందన్నారు. అయితే అధికార పక్షాన్ని విమర్శించేందుకు ప్రతిపక్ష నేతల వద్ద ఏమీ లేకపోవడంతోనే మధ్యలోనే సభ నుంచి వెళ్లిపోయారని ఆరోపించారు. ప్రజల కోసం ప్రజా అవసరాల కోసం ఈ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ప్రజల జీవితాల్లో మార్పు కోసం పని చేస్తామన్న భట్టి... తమను చులకన భావంతో చూడొద్దన్నారు. బీఆర్ఎస్ నేతల అహంకారాన్ని జీర్ణించుకునే పరిస్థితుల్లో ప్రజలు లేరని స్పష్టం చేశారు. అలవి కానీ హామీలు ఇచ్చామని హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. వాళ్లలాగా అలవి కానీ హామీలు ఇచ్చుకుంటూ పోతే బడ్జెట్ రూ. ఐదు లక్షల కోట్ల కు పైగా పెట్టాల్సి వచ్చేదని చెప్పారు. ఈ సారి బడ్జెట్ లో రైతు భరోసా చేయూత ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నధాన్యానికి బోనస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహ జ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, కళ్యాణ లక్ష్మి పథకాల కోసం రూ. 50 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. రైతు భరోసా కోసం రూ. 18 వేల కోట్లు ఖర్చు చేశామన్నాయన తొమ్మిది రోజుల్లో రూ. 9వేల కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలో జమా చేసిన ఘనత కాంగ్రెస్ సర్కార్ దే అన్నారు. హైదరాబాద్కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును బీఆర్ఎస్ నేతలు ఎన్నికల ముందు కుదువబెట్టి వచ్చిన డబ్బులను ఎన్నికల ముందు రైతుబంధు పేరిట రైతుల ఖాతాల్లో జమ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 46శాతం మంది వ్యవసాయంపై ఆధారపడ్డారన్న భట్టి... రైతుల సంక్షేమం తమ ప్రభుత్వ ఆలోచన సన్నధాన్యం సాగు చేసే రైతులకు 500 బోనస్ ఇస్తామని చెప్పామన్నారు. మిగిలిన పంటలు ఎవరైనా సాగు చేస్తే వారిని ప్రోత్సహించాలని ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందని చెప్పారు. వ్యవసాయాన్ని పండుగ చేశామన్నారు. ఉచిత కరెంటు కాంగ్రెస్ పేటెంట్ ఉచిత కరెంటు పథకం దేశానికి దిశా నిర్దేశం చేశామన్న భట్టి విక్రమార్క... రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు 14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు.

# కాంగ్రెస్‌ను వీడుతున్నట్టే !

**మొదటి పేజీ తరువాయి**

జీవన్‌రెడ్డితో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ మంగళవారం జగిత్యాలలో కీలక భేటీ నిర్వహించారు. పార్టీని వీడొద్దని.. కాంగ్రెస్‌లోనే కొనసాగాలని.. విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చీఫ్ చర్చలు జరిపారు. అంతకుముందు ఏఐసీసీ నేతలు కూడా జీవన్ రెడ్డి పార్టీలోనే కొనసాగాలని ఆయనను కోరినా.. జీవన్ రెడ్డి మాత్రం తన పంతం వీడటం లేదు. ఇక ఈ భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. జీవన్ రెడ్డి తనకు తండ్రి సమానులు అని.. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆయన అని తెలిపారు. తెలంగాణలో జీవన్‌రెడ్డి కన్నా సీనియర్ నాయకులు లేరని.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కొంత ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. ఈ వయసులోనూ జీవన్‌రెడ్డి ఇబ్బంది పడ్డారని.. రాజకీయాల్లో కొన్నిసార్లు అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఆయన ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టే తన సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు కూడా వచ్చారని పేర్కొన్నారు. ఇవాళ తాను కూడా జగిత్యాలకు వెళ్లి కలిసినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకోవద్దని.. తమను వీడొద్దని వారికి విన్నవించినట్లు చెప్పుకొచ్చారు. కార్యకర్తల ఒత్తిడి కారణంగా జీవన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. జీవన్‌రెడ్డితో తనకు 1986 నుంచి పరిచయం ఉందని.. అప్పటి నుంచి తనకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయరనే ఆశతో జగిత్యాల నుంచి వెళ్తున్నానని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. మరోవైపు.. ఈ భేటీ సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు కూడా జీవన్ రెడ్డి ఆసక్తి చూపకపోవడం గమనార్హం. మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో పార్టీ నేతలు జీవన్ రెడ్డి మెడలో హస్తం పార్టీ కండువా వేసేందుకు ప్రయత్నించగా.. ఆయన తిరస్కరించారు. ఇక వీరి భేటీ తర్వాత జీవన్ రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని ఆయన అభిమానులు తొలగించారు. ఇందిరా భవన్ పేరుతో ఉన్న ఫ్లెక్సీని తీసేశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన జీవన్‌రెడ్డి.. ఇది పరిష్కారం లేని సమస్యగా మారిందని.. ఆ సమస్యకు పరిష్కారం కూడా తన వద్ద లేదని తెలిపారు. దీనికి పరిష్కారం వారి దగ్గర కూడా లేదని పేర్కొన్నారు. బుధవారం 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ కావాలని.. గార్డెన్‌కి రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు, తన తర్వాతి పయనం ఎలా ఉంటుందో తెలియదని పేర్కొన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం చేయలేనని తేల్చి చెప్పారు. తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్నట్లు చెప్పిన జీవన్ రెడ్డి.. తన నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి జీవన్‌రెడ్డి బుధవారం రోజున రాజీనామా చేయనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఇప్పట్లో ఏ పార్టీలో చేరేది లేదని ఇప్పటికే జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై ఇంకా దాడులు

**మొదటి పేజీ తరువాయి**

దాడులు జరిగాయి. టెహ్రాన్, ఇతర కీలక ప్రదేశాలలో పేలుళ్లు సంభవించినట్లు వార్తలు రాగా, గ్యాస్ కేంద్రాలు, పైప్‌లైన్‌లకు కూడా నష్టం వాటిల్లిందని ఇరాన్ అధికారులు తెలిపారు. పెరుగుతున్న ప్రాంతీయ ఉద్రిక్తతలు, చర్చల సాధ్యత, అనిశ్చితి, ప్రపంచ ఇంధన సరఫరాలు, గల్ఫ్ ప్రాంత భద్రతపై ఈ సంఘర్షణ ప్రభావం గురించి పెరుగుతున్న ఆందోళనల మధ్య ఈ దాడులు కొనసాగుతున్నాయి.

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు సంభవించాయని, అలాగే తబ్రిజ్, ఇస్ఫహాన్, కరాజ్‌లపై కూడా దాడులు జరిగాయని ఇరాన్ మీడియా నివేదికలు తెలిపాయి. విద్యుత్ మౌలిక సదుపాయాలపై జరగాల్సిన దాడులు వాయిదా పడ్డాయని వార్తలు వచ్చిన కొన్ని గంటల తర్వాత, మధ్య ఇరాన్‌లోని రెండు గ్యాస్ కేంద్రాలు, ఒక పైప్‌లైన్‌పై ఇజ్రాయెల్ అమెరికా దాడులు జరిగాయని ఫార్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.

నైరుతి ఇరాన్‌లోని ఖొర్రమ్‌షహర్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాసెసింగ్ యూనిట్ సమీపంలో ఒక క్షిపణి పడిందని, సరిహద్దు నగర గవర్నర్‌ను ఉటంకిస్తూ ఆ ఏజెన్సీ తెలిపింది.

టెహ్రాన్‌కు ఉత్తరాన ఉన్న తన నివాసంపై దాడి జరగడంతో, ఇరాన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ సయీద్ షమఘ్దారీ తన ఇద్దరు పిల్లలతో పాటు మరణించారని స్థానిక నివేదికలు తెలిపాయి. ఆయుధాల అభివృద్ధికి ఇరాన్ విద్యావేత్తలకు సంబంధాలు ఉన్నాయని ఇజ్రాయెల్ గతంలో ఆరోపించింది.

**సంఘర్షణ తీవ్రమవుతున్న తరుణంలో చర్చలపై అస్పష్టత**

దౌత్య సంకేతాలు అనిశ్చితంగా ఉన్న తరుణంలో ఈ దాడులు జరిగాయి. నివేదికల ప్రకారం, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి గత 24 గంటల్లో ఈజిప్ట్, ఒమన్‌లోని అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. అయితే, చర్చలు చాలా ఫలవంతమయ్యాయి అని ట్రంప్ చెప్పినప్పటికీ, అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరగడాన్ని ఇరాన్ ఉన్నతాధికారులు ఖండించారు. చర్చలకు దిగే ముందు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, గతంలో చర్చలు జరుగుతున్నాయన్న వాదనలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని ఇరాన్ చట్టసభ సభ్యుడు ఇస్మాయిల్ కౌసరి హెచ్చరించినట్లు నివేదికలు తెలిపాయి. ఈ ఘర్షణ విస్తృత మధ్యప్రాచ్యం అంతటా వ్యాపించడంతో, చమురు ధరలు పెరిగడంతో పాటు ప్రపంచ ఇంధన సంక్షోభం భయాలు పెరిగాయి. తూర్పు ప్రావిన్స్‌ను లక్ష్యంగా చేసుకున్న 19 డ్రోన్‌లను తమ వాయు రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని సౌదీ అరేబియా చెప్పగా, రాత్రిపూట పలు క్షిపణి ,డ్రోన్ హెచ్చరికలు అందినట్లు, తెల్లవారుజాము వరకు సైరన్‌లు పదేపదే మోగినట్లు కువైట్ నివేదించినట్లు ప్రాంతీయ నివేదికలు పేర్కొన్నాయి.

# యుద్ధ పరిణామాలపై నేడు అఖిలపక్షం

**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం):** పశ్చిమాసియాలో పరిణామాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం రాజ్యసభలో ప్రసంగించారు. సోమవారంనాడు లోక్ సభలో ప్రసంగించిన ఆయన, మరురోజే పెద్దల సభలో మాట్లాడారు. ఈ సంక్షోభం నడుమ భారత్ వద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉండటమే కాక ఆరోగ్యవంతమైన సరఫరా ఏర్పాట్లు ఉన్నాయని ఆయన సభకు తెలిపారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను, శుద్ధి సామర్థ్యాన్ని విస్తరించామని, సంక్షోభం నడుమ చోటు చేసుకుంటున్న అంతరాయల నుంచి దేశాన్ని కాపాడేందుకు ఇంధన దిగుమతులు ఇప్పుడు 41 దేశాల నుంచి వస్తున్నాయని, దేశీయ గ్యాస్, ఎరువుల సరఫరాలను బలోపేతం చేస్తున్నామని ప్రధాని వివరించారు. గల్ఫ్ దేశాల్లోని భారతీయులు యుద్ధ సంక్షోభంలో చిక్కుకున్నారని ప్రధాని తెలిపారు. ఆయా దేశాల్లో కోటి మందికి పైగా భారతీయ కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. గల్ఫ్ దేశాల నుంచి 3.75 లక్షల మందిని సురక్షితంగా భారతదేశానికి తీసుకువచ్చామని అన్నారు. భారతీయుల రక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామని తెలిపారు. మన ముందు చాలా సవాళ్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అర్థిక వ్యవస్థకు ఇంధనమే వెన్నెముక అని, ఇంధన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని చెప్పారు. గృహావసరాలకు సరిపడా ఎల్పీజీ సరఫరా పెంచుతున్నామని చెప్పారు. 41 దేశాల నుంచి పెట్రో ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటున్నామని, 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ప్రభావం పడిందన్నారు. శత్రుత్వం వీడి, ఉద్రిక్తతలకు తగ్గించేందుకు కృషిచేయాలని అన్నిపక్షాల వారిని భారత్ కోరుతోంది. భారత్‌పై కూడా యుద్ధం ప్రభావం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ దశలో పెద్దల సభ ఏకగ్రీవంగా శాంతి, చర్చల సందేశాన్ని ఇవ్వడం ముఖ్యమని పేర్కొన్నారు.

# జాతీయం-అంతర్జాతీయం

## ఇరాన్‌కు రష్యా సాయం

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సంచలన వ్యాఖ్యలు

**ఉదయం డెస్క్, మార్చి 24:**



పశ్చిమాసియాలో యుద్ధానికి రష్యా ఆజ్యం పోస్తోందనడానికి ఉక్రెయిన్ సైనిక నిఘా వద్ద తిరుగులేని ఆధారాలు ఉన్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడమిర్ జెలెన్స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కారణంగా మధ్య ప్రాచ్యంలో యుద్ధం ఇప్పుడే ముగిసే అవకాశం లేదని ఆయన అన్నారు.
రష్యా తన సొంత సిగ్నల్స్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాలను, అలాగే మధ్యప్రాచ్యంలోని భాగస్వాములతో సహకారం ద్వారా పొందిన డేటాలో కొంత భాగాన్ని ఉపయోగిస్తోంది, అని సైనిక గూఢచార అధిపతితో సమావేశమైన తర్వాత ఆయన ఎక్స్‌పై పేర్కొన్నారు.
ఇరాన్ ప్రభుత్వానికి రష్యా ఇంటెలిజెన్స్ మద్దతు అందిస్తోంది. ఇందుకు తమ వద్ద కచ్చితమైన ఆధారాలు ఉన్నాయి. ఇది విధ్వంసకర చర్య. దీన్ని వెంటనే ఆపాలి. లేదంటే పరిస్థితి మరింత దిగజారుతుంది అని జెలెన్స్కీ ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాలు సంక్షోభాన్ని నివారించే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. యుద్ధం నేపథ్యంలో మార్కెట్లు ప్రతికూలంగా ఉన్నాయని, పలు దేశాల్లో ఇంధన సరఫరాపై గందరగోళం నెలకొందన్నారు. ఇరాన్ పాలన నిలదొక్కుకోవడానికి.. అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలపై ఆ దేశం కచ్చితమైన దాడులు చేయడానికి రష్యా సాయపడటాన్ని తప్పుబట్టారు. దీని కారణంగా యుద్ధం మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందన్నారు. దీనిపై వెంటనే ప్రతిస్పందించాల్సిన అవసరం ఉందన్నారు.
కాగా, రష్యా ఉపగ్రహ చిత్రాలను, మెరుగైన డ్రోన్ సాంకేతికతను ఇరాన్‌కు అందిస్తోందంటూ వాల్ స్ట్రీట్ జర్నల్‌లో గత వారం వచ్చిన వార్తలను అబద్ధపు వార్తలంటూ గత వారం క్రెమ్లిన్ ఖండించింది. ఇరాన్‌కు రష్యా వ్యూహాత్మక మద్దతు ఇస్తోందని యుద్ధం ప్రారంభంలో పలు మీడియాల్లో వార్తలు వచ్చాయి. మాస్కో సాయంతోనే అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, సైనిక స్థావరాలపై ఇరాన్ లక్ష్యిత దాడులు చేయగలుగుతుందనేది అవి పేర్కొన్నాయి. ఇప్పుడు జెలెన్స్కీ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. అయితే, దీనిపై రష్యా, ఇరాన్ అధికారులు ఇంతవరకు స్పందించలేదు. ఇక, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులపై రష్యా విదేశాంగ మంత్రి లావ్రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరాన్‌లోని బుషెహర్ అణుకేంద్రంతో సహా ఆ దేశ మౌలిక సదుపాయాలపై అమెరికాఇజ్రాయెల్ దాడులు ఆమోద యోగ్యం కావని లావ్రోవ్ అన్నారు.

దేశంలో తొలి కారుణ్య మరణం

## హరీష్ తుదిశ్వాస

**న్యూఢిల్లీ, మార్చి 24 (ఉదయం) :**



భారతదేశంలో కారుణ్య మరణానికి అనుమతి పొందిన తొలి వ్యక్తి అయిన హరీష్ రాణా మంగళవారం ఢిల్లీ ఎయిమ్స్ లో తుది శ్వాస విడిచినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాదవశాత్తు గాయపడి 13 ఏళ్ల పాటు కోమాలో ఉన్న అతడికి సుప్రీం కోర్టు కారుణ్య మరణాన్ని అనుమతించడంతో ఎయిమ్స్ వైద్యులు వైద్యం నిలిపివేశారు. పంజాబ్ యూనివర్సిటీలో బిటెక్ విద్యార్థి అయిన హరీష్ 2013లో నాలుగవ అంతస్తు నుంచి పడిపోవడంతో తలకు తీవ్రమైన దెబ్బలు తగిలాయి. అప్పటి నుంచీ అతడు కోమాలో ఉన్నాడు. ప్రముఖ ఆసుపత్రుల్లో చికిత్స అందించినా, అతని ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. అప్పటినుంచి అతడు కోమాలోనే ఉండిపోయాడు. కుమారుడి చికిత్స కోసం ఆర్థికంగా, మానసికంగా చితికిపోయిన ఆ తల్లిదండ్రులు అతడి కారుణ్య మరణానికి అనుమతించాలంటూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వైద్య నివేదికలు పరిశీలించిన అనంతరం రాణాకు చికిత్స నిలిపివేయొచ్చని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఈ తరహా తీర్పు వెలువరించడం ఇదే మొట్టమొదటిసారి. ఈ తీర్పు అనంతరం మార్చి 14న రాణాను గాజియాబాద్‌లోని ఇంటి నుంచి దిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. అప్పటి నుంచి అందిస్తోన్న చికిత్సను దశలవారీగా తగ్గించారు. ఈ క్రమంలోనే అతడు తుదిశ్వాస విడిచాడు. కృత్రిమ ప్రాణ రక్షణను తొలగించడం వల్ల తమ కుటుంబానికి వ్యక్తిగతంగా ఎలాంటి ప్రయోజనం చేకూరదని, అయితే విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇతరులకు ఈ నిర్ణయం సహాయపడగలదని సుప్రీం కోర్టు తీర్పు తర్వాత హరీష్ కుటుంబం పేర్కొంది. సంవత్సరాల తరబడి కోలుకోలేని బాధ తర్వాత, కారుణ్య మరణం హరీష్ గౌరవాన్ని పునరుద్ధరిస్తుందని అతని తండ్రి అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును వైద్య నిపుణులు ఆహ్వానించారు. ఒక ప్రత్యేక ప్రణాళికతో లైఫ్ సపోర్ట్‌ను ఉపసంహరించుకోవాలని ఎయిమ్స్‌ఢిల్లీని సుప్రీంకోర్టు ఆదేశించింది. భారతదేశంలోనే తొలిసారిగా ఈ ప్రక్రియను అమలు చేయడానికి, అనస్థీషియా, పాలియేటివ్ మెడిసిన్ విభాగాధిపతి , ప్రొఫెసర్ అయిన డాక్టర్ సీమా మిశ్రా నేతృత్వంలో ఒక ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు.

## ప్రధానిపై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, మార్చి 24 (ఉదయం) :**



పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకొని విమర్శల వర్షం కురిపించారు. భారత విదేశాంగ విధానం ఆయన వ్యక్తిగత విదేశాంగ విధానంగానూ, ఒక సార్వత్రిక హాస్యాస్పద విషయంగానూ మారిపోయిందని ఆరోపించారు. అమెరికాఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పాకిస్థాన్ ఒక మధ్యవర్తిగా వ్యవహరిస్తోందన్న వార్తలు, పశ్చిమ ఆసియా సంక్షోభంపై భారతదేశ వైఖరి గురించి ఆయనను ప్రశ్నించినప్పుడు, మన విదేశాంగ విధానమే ప్రధాని మోడీ వ్యక్తిగత విదేశాంగ విధానం. దీని ఫలితాన్ని మీరు చూడవచ్చు. ఇది ఒక సార్వత్రిక హాస్యాస్పద విషయంగా మారింది. ప్రతి ఒక్కరూ దీనిని ఒక సార్వత్రిక జోక్‌గానే భావిస్తారు. మోడీ ఏమి చేయగలరో, ఏమి చేయలేరో డొనాల్డ్ ట్రంప్‌కు కచ్చితంగా తెలుసు. కాబట్టి, ప్రధాని రాజీపడితే, మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్లే అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు స్పందించారు.
లోక్‌సభలో కోవిడ్ లాంటి సంక్షోభం అంటూ ప్రధాని హెచ్చరించిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ, మహమ్మారి సమయంలో ఎంత మంది చనిపోయారో, జరిగిన విషాదాల తీవ్రతను ఆయన (మోడీ) మర్చిపోయారని రాహుల్ అన్నారు. ఇలాంటి విషయాలపై ప్రభుత్వానికి అవగాహన లేదని ఆయన ఆరోపించారు.
నిన్న (లోక్‌సభలో) ఆయన అప్రస్తుత ప్రసంగం చేశారు. ఆయన భారతదేశ ప్రధానమంత్రి; ఆయన ప్రవర్తన చూస్తే ఆయన నిజంగానే భారతదేశ ప్రధాని అనిపించాలి. కానీ ఆయనలో ఆ స్థాయి, హోదా ఏమాత్రం కనిపించడం లేదు. ప్రజలు ఇబ్బందులకు గురికావడం విచారకరం; ఇది ఇప్పుడే మొదలైంది. ఎల్.పి.జి., పెట్రోల్, ఎరువులు—ఇలా ప్రతి విషయానికి సంబంధించి మనం సమస్యలను ఎదుర్కోక తప్పదు... పరిస్థితి మళ్ళీ కోవిడ్ సమయంలా మారుతుందని ఆయన చెబుతున్నారు, కానీ కోవిడ్ సమయంలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో, ఎటువంటి విషాదాలు చోటుచేసుకున్నాయో ఆయన మర్చిపోయినట్లున్నారు, అని గాంధీ వ్యాఖ్యానించారు.
పశ్చిమాసియా అంశంపై బుధవారం జరగనున్న అఖిలపక్ష సమావేశంలో తాను పాల్గొనలేనని, కేరళలో తాను హాజరుకావాల్సిన ఒక కార్యక్రమం ఉన్నందున ఇది సాధ్యపడదని రాహుల్ తెలిపారు. భారతదేశ ప్రయోజనాలకంటే, అమెరికా, ఇజ్రాయెల్ ఆదేశాల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.
అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు, అక్కడ చర్చ జరగాలి. కానీ మీరు ఒక వ్యవస్థాగత తప్పిదం చేశారు. మీరు ఆ వ్యవస్థాగత చట్రం మొత్తాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. ఇకపై దీనిని సరిదిద్దడం సాధ్యం కాదు, ప్రధాని మోడీ దీనిని సాధించలేరని నేను మీకు లిఖితపూర్వకంగా ఇవ్వగలను, అని గాంధీ అన్నారు.
ప్రధాని మోడీ అమెరికా, ఇజ్రాయెల్ చెప్పిందే చేస్తారు. ఆయన భారతదేశ ప్రయోజనాల కోసం గానీ, రైతుల ప్రయోజనాల కోసం గానీ పనిచేయరు; దానికి బదులుగా, అమెరికా, ఇజ్రాయెల్ చెప్పిన ప్రకారమే వ్యవహరిస్తారు, అని ఆయన అన్నారు.
సోమవారం అంతకుముందు లోక్‌సభలో ప్రసంగిస్తూ, మోడీ పశ్చిమాసియా సంఘర్షణను ఆందోళనకరమైనదిగా అభివర్ణించారు. ఇది భారతదేశానికి ఆర్థిక, జాతీయ భద్రతకు సంబంధించినవే కాకుండా మానవతాపరమైన సవాళ్లను సృష్టించిందని ఆయన అన్నారు. ఈ సంక్షోభంపై భారత పార్లమెంటు నుంచి ప్రపంచానికి ఒక ఏకగ్రీవ స్వరం వినిపించాలని ఆయన అన్నారు.
మంగళవారం రాజ్యసభలో ప్రసంగిస్తూ, పశ్చిమ ఆసియా సంక్షోభం ఎక్కువకాలం కొనసాగితే తీవ్ర పరిణామాలు తప్పవని ప్రధానమంత్రి హెచ్చరించారు.

## లారిజానీ స్థానంలో జోల్కాద్ర్

### ఇరాన్ భద్రతామండలి నూతన అధిపతి





**ఉదయం డెస్క్, మార్చి 24 :**

గత వారం జరిగిన ఒక దాడిలో ఇరాన్ అత్యున్నత భద్రతా నిర్ణయాధికార సంస్థ అయిన సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ ఎన్ ఎస్‌సి) అధిపతిగా ఉన్న అలీ లారిజాని మరణించిన నేపథ్యంలో, ఆయన స్థానంలో కొత్త కార్యదర్శిగా మహమ్మద్ బాకర్ జోల్కాద్ర్ నియమితులయ్యారు.
దేశ భద్రతా వ్యవస్థకు కీలకమైన సమయంలో వేగవంతమైన నాయకత్వ మార్పును ధృవీకరిస్తూ, ఇరాన్ అధ్యక్షుడి కమ్యూనికేషన్ల డిప్యూటీ మంగళవారం ఎక్స్‌పై ఒక పోస్ట్ ద్వారా ఈ ప్రకటన చేశారు.
ప్రాంతంలో ఉద్రిక్తతలను మరింత పెంచిన ఒక దాడిలో ప్రముఖ సంప్రదాయవాద రాజకీయ నాయకుడు, మాజీ పార్లమెంట్ స్పీకర్ అయిన అలీ లారిజానీ మరణించారు. ఆయన మరణం ఇరాన్ నాయకత్వానికి తీరని లోటు, ఇది వేగవంతమైన చర్యలకు దారితీసింది.
ప్రత్యక్ష సైనిక చర్యకు అతీతంగా, దాని పర్యవసానాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంధన మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి, ప్రపంచ చమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి, హోర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల ద్వారా అంతరాయం కలుగుతుందనే భయాలు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. అదే సమయంలో, భద్రతా కూటములు పరీక్షకు గురవుతున్నాయి. ప్రాంతీయ దేశాలు తమ రక్షణ చర్యలను ముమ్మరం చేస్తుండగా, పరిస్థితి మరింత తీవ్రమయ్యే సంకేతాల కోసం ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. మానవతాపరమైన ఆందోళనలు కూడా తీవ్రమవుతున్నాయి. సంఘర్షణ ప్రభావిత ప్రాంతాలలో, ముఖ్యంగా లెబనాన్, ఇరాన్‌లోని కొన్ని భాగాలలో, పెద్ద ఎత్తున ప్రజలు నిరాశ్రయులవ్వడం అనేది ఇప్పటికే ఒత్తిడికి గురైన వ్యవస్థలపై అదనపు భారాన్ని మోపుతోంది. విద్యుత్ నెట్‌వర్క్‌లు, పట్టణ ప్రాంతాలతో సహా మౌలిక సదుపాయాలపై దాడులు పౌర జీవితాన్ని మరింత ప్రత్యక్షంగా ప్రభావితం చేయడం ప్రారంభించాయి.

కశ్మీరీ వేర్పాటువాది

## ఆసియా అంద్రబీకి యావజ్జీవం

**న్యూఢిల్లీ, మార్చి 24 (ఉదయం) :**



ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాశ్మీరీ వేర్పాటువాది ఆసియా అంద్రబీకి, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద ఢిల్లీలోని ఒక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దుఖతరన్‌ఎమిల్లత్ అధిపతి అయిన ఆమెపై దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం, కుట్ర పన్నడం వంటి అభియోగాలు మోపారు.

**ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్లు నిర్ధారించిన కోర్టు**


ఆమె సహచరులైన సోఫీ ఫెహ్మీదా, నహిదా నస్రీన్‌లకు చెరో 30 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అంతకుముందు, దుఖతరన్‌ఎమిల్లత్‌కు సంబంధించిన కార్యకలాపాలలో పాల్గొన్నందుకు ఈ ముగ్గురినీ దోషులుగా నిర్ధారించారు. ఇది భారతదేశం నుండి జమ్మూ కాశ్మీర్‌ను వేరు చేయాలని కోరిన ఒక నిషేధిత సంస్థ. కుట్రకు సంబంధించిన సెక్షన్ 18, ఉగ్రవాద సంస్థలో సభ్యత్వానికి సంబంధించిన సెక్షన్ 38తో సహా పలు యుఎపిఎ నిబంధనల కింద కోర్టు వారిని దోషులుగా నిర్ధారించింది. అలాగే, నేరపూరిత కుట్ర, దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం వంటి భారత శిక్షా స్మృతి (ఐపిసి) నిబంధనల కింద కూడా కోర్టు వారిని దోషులుగా నిర్ధారించింది.

### ఏమిటీ దుఖతరన్-ఎ-మిల్లత్?

దుఖతరన్‌ఎమిల్లత్ అనేది పూర్తిగా మహిళా సంస్థ. ఇది కాశ్మీర్‌లో ఇస్లామిక్ చట్టాన్ని స్థాపించడానికి, భారతదేశం నుండి జమ్మూ, కాశ్మీర్‌ను విడదీసి, పాకిస్తాన్‌లో విలీనం కావడానికి జిహాద్‌ను సమర్థించింది. ఇది హిజ్బుల్ ముజాహిదీన్ అనే జిహాదీ ఉగ్రవాద సంస్థకు చెందిన ఒక అనుబంధ సంస్థ. 1987లో ఏర్పడిన ఈ సంస్థకు ఆసియా అంద్రాబీ నాయకత్వం వహించారు. 1990ల ప్రారంభంలో కాశ్మీర్ ఉగ్రవాదం సమయంలో, ఈ సంస్థ ముఖానికి ముసుగు, బురఖా ధరించని మహిళలను బెదిరించింది, వారిలో కొందరు యాసిడ్ దాడులకు గురయ్యారు. ఈ బృందం ప్రధానంగా ఇంటర్నెట్ వేదికల ద్వారా ప్రచారం చేసింది. నివేదికల ప్రకారం నేరుగా ఆయుధాలు చేపట్టలేదు. 2018లో, ఆసియా అంద్రాబి, ఆమె కార్యదర్శిని ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలపై ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఆమె అరెస్టుతో ఆ బృందం నిష్క్రియమైంది. ఇక ఇప్పుడు దాన్ని రద్దైనదానిగా పరిగణిస్తారు.

## యుద్ధంలోకి సౌదీ, యూఏఈ?

**న్యూఢిల్లీ, మార్చి 24 (ఉదయం) :**



ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన వేళ వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనం సంచలనంగా మారింది. టెహ్రాన్‌పై అగ్రరాజ్యం సాగిస్తోన్న యుద్ధంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాల్గొనేందుకు సిద్ధమైనట్లు ఆ కథనం పేర్కొంది. గతంలో తమ వైమానిక స్థావరాలను అమెరికా సైన్యం ఉపయోగించుకొనేందుకు అనుమతించని సౌదీ అరేబియా.. ప్రస్తుతం అందుకు అంగీకరించినట్లు ఆ కథనం తెలిపింది. మరోవైపు, యూఏఈ ఇరాన్‌కు చెందిన ఓ ఆసుపత్రిని, క్లబ్‌ను మూసివేసింది. ఈ పరిణామాలు చూస్తుంటే.. యుద్ధం విషయంలో అమెరికాకు సౌదీ, యూఏఈ ప్రత్యక్షంగా సాయం చేసే అవకాశాలు కన్పిస్తున్నట్లు తెలుస్తోంది.
ఇటీవల ఇరాన్ పైకి దూసుకెళ్లిన కొన్ని క్షిపణులు బహ్రెయిన్ నుంచే ప్రయోగించినట్లు వీడియోలు బయటికొచ్చాయి. పశ్చిమాసియాలో సుదీర్ఘంగా జరుగుతున్న దాడుల వల్ల తమ ఆర్థికవ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉందని గల్ఫ్ దేశాలు భావిస్తున్నాయి. దీనికితోడు హర్మూజ్ జలసంధిని ఇరాన్ నియంత్రించడంపైనా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే పర్షియన్ గల్ఫ్‌లోని అమెరికా మిత్ర దేశాలు.. యుద్ధంలో అగ్రరాజ్యానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సదరు కథనం పేర్కొంది. అయితే, ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించలేదు.


## రూ.181 కోట్లు, మద్యం, డ్రగ్స్ స్వాధీనం

**ఉదయం డెస్క్, మార్చి 24 :**

294 మంది సభ్యులున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు రెండు దశల్లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ నేపథ్యంలో బెంగాల్‌లో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాయి. అప్పటి నుంచి డబ్బు, మద్యం, డ్రగ్స్, ఉచిత సామగ్రి సహా రూ.181 కోట్లకు పైగా విలువైన సొత్తును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్చి 15వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి మొత్తం 294 నియోజకవర్గాల పరిధిలో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి రావడం తెల్సిందే. అప్పట్నుంచి, విస్తృతంగా సోదాలు చేపట్టినట్లు చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) కార్యాలయం తెలిపింది.
జిల్లాలవారీగా 3,58,986 కేసులు నమోదు చేయగా, మొత్తం 3,11,829 ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాలను, 19,901 ప్రైవేట్ ఆస్తుల విధ్వంసాలను తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఫిర్యాదులకు స్పందించడానికి, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను తనిఖీ చేయడానికి 1,800కు పైగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 2,200కు పైగా స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్‌ను మోహరించినట్లు అధికారులు తెలిపారు.

## లెబనాన్‌పై దాడులు తీవ్రం

**ఉదయం డెస్క్, మార్చి 24 :**



మధ్యప్రాచ్యంలో ఇరాన్ యుద్ధం అనేక ఫ్రంట్‌లలో తీవ్రతరమవుతోంది. కొనసాగుతున్న దాడులు, పెరుగుతున్న ప్రాణనష్టం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ప్రభావం వంటివన్నీ పరిస్థితిని అస్థిరంగా, అత్యంత అనిశ్చితంగా ఉంచుతున్నాయి. వాషింగ్టన్, టెహ్రాన్ నుండి వస్తున్న పరస్పర విరుద్ధమైన ప్రకటనలు గందరగోళాన్ని మరింత పెంచాయి. చర్చల అవకాశాలపై ఇరు పక్షాల నుంచి పూర్తిగా భిన్నమైన వాదనలను వినిపిస్తున్నాయి. అమెరికా దౌత్యపరమైన అవకాశాలకు సంకేతాలు ఇస్తుండగా, ఇరాన్ అటువంటి వాదనలను తోసిపుచ్చింది. ఇది ప్రస్తుత తరుణంలో నెలకొన్న తీవ్ర అపనమ్మకాన్ని మరింత బలపరుస్తోంది.
ఇలా ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగిస్తోంది. దక్షిణ లెబనాన్ నుంచి లిటానీ నది వరకూ ఉన్న భద్రతా జోన్‌ను స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రతినబూనింది. ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్ నుంచి లిటానీ నది వరకు గల ప్రాంతాన్ని నియంత్రణలోకి తీసుకుంటుందంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ పేర్కొన్నారు. తన ఉత్తర సరిహద్దు వెంట ఇజ్రాయెలీ భద్రతా స్థితిలో గణనీయమైన ఉద్రిక్తత ఉంటుందని సంకేతాలు ఇచ్చారు.
ఒక సైనిక కమాండ్ సెంటర్‌ను సందర్శించిన సందర్భంగా కట్జ్ మాట్లాడుతూ, ఉగ్రవాదుల, ఆయుధాల రవాణా కోసం హిజ్బుల్లా ఉపయోగించిన లిటానీ నదిపై ఉన్న ఐదు వంతెనలన్నింటినీ పేల్చివేశాం. మిగిలిన వంతెనలు, లిటానీ వరకు ఉన్న భద్రతా మండలాన్ని ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ సైన్యం) నియంత్రిస్తుంది అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంత నివాసులకు భద్రతకు హామీ ఇచ్చే వరకు కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంఘర్షణ కారణంగా నిరాశ్రయులైన లక్షలాది మంది దక్షిణ లెబనాన్ నివాసులు, లిటానీ నదికి దక్షిణంగా తిరిగి రారు అని ఆయన ఇంకా తెలిపారు.

**ఇరాన్ రాయబారి బహిష్కారం**

ఈ నేపథ్యంలోనే దౌత్య నిబంధనల ఉల్లంఘనను కారణంగా చూపుతూ, ఇరాన్ రాయబారిని లెబనాన్ బహిష్కరించింది . ఇరాన్ రాయబారి అక్రిడిటేషన్‌ను ఉపసంహరించుకుని, అతడిని అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి, ఆదివారం లోగా దేశం విడిచి వెళ్ళిపోవాలని ఆదేశించినట్లు లెబనాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. స్థిరపడిన దౌత్య నియమాలను, పద్ధతులను టెహ్రాన్ ఉల్లంఘిస్తోందని బీరూట్ ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఈ చర్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తీవ్రంగా పెరగడానికి సంకేతంగా ఉంది. ఇరు దేశాల మధ్య వివాదం తీవ్రతను నొక్కి చెబుతూ, మంత్రిత్వ శాఖ ఇరాన్‌లోని లెబనాన్ రాయబారిని సంప్రదింపుల కోసం పిలిపించింది.

**ఇస్ఫహాన్‌పై భారీ స్థాయిలో ఇజ్రాయెలీ దాడులు**

ఇరాన్‌లోని కేంద్ర నగరమైన ఇస్ఫహాన్‌తో సహా పలు ప్రాంతాల్లో, తాము భారీ ఎత్తున వైమానిక దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఐడిఎఫ్ ఇస్ఫహాన్‌లో భారీ స్థాయి దాడులను పూర్తి చేసింది అని ఒక ప్రకటనలో పేర్కొంటూ, ఇరాన్‌లోని అనేక ప్రాంతాల్లో తాము విస్తృత స్థాయి దాడుల పరంపరను ప్రారంభించినట్లు జోడించింది.

పర్షియన్ గల్ఫ్ లో సిద్ధంగా

## 6 ఎల్పీజీ ట్యాంకర్లు

**ఉదయం డెస్క్, మార్చి 24 :**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉండటంతో.. ఎల్పీజీ కొరత రాకుండా చూసుకునేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పర్షియన్ గల్ఫ్‌లో నిలిచిన మరికొన్ని ట్యాంకర్లను హర్మూజ్ జలసంధి దాటించేందుకు ఇరాన్ అధికారులతో కేంద్రం చర్చలు జరుపుతోంది. అవి ఓకే అయితే ఆరు ట్యాంకర్లు భారత్‌కు చేరుకుంటాయి. 3,00,000 టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.
భారత్ నౌకలకు దీర్ఘకాలిక గ్యారెంటీ లేకపోవడంతో.. ఎప్పటికప్పుడు ఇరాన్‌తో చర్చల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే అంతర్గత పరిస్థితుల దృష్ట్యా నౌకల అనుమతుల విషయంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) నిర్ణయం తీసుకోవడం ఆలస్యమవుతోంది. ఇదిలాఉంటే.. ఎల్పీజీని మోసుకొస్తోన్న జగ్ వాసంత్, పైన్ గ్యాస్ ట్యాంకర్లు హర్మూజ్‌ను దాటి, ఇప్పటికే అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అవి కొన్నిరోజుల్లో భారత్‌కు చేరుకోనున్నాయి. కాగా, తమ అధికారులతో సమన్వయం చేసుకొంటూ తటస్థ దేశాల నౌకలు హర్మూజ్ మీదుగా వెళ్లొచ్చని ఇరానియన్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరాన్ అధికారులు సహకార వైఖరిని అవలంబిస్తున్నారని భారత ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హర్మూజ్ నుంచి నౌకల రాకపోకల విషయంలో కాస్త సానుకూలత కనిపిస్తోంది.









"హిందు, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వ్యక్తులే షెడ్యూల్డ్ కుల హోదాను కోరడానికి అర్హులు. క్రైస్తవం వంటి ఇతర మతాలలోకి మారినవారు షెడ్యూల్డ్ కుల హోదాను తక్షణమే కోల్పోతారు. క్రైస్తవంలోకి మారిన దళిత వ్యక్తి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నిరోధ) చట్టం కింద రక్షణకు అర్హులు కారు. 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాల) ఉత్తర్వులోని 3వ క్లాజ్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నది. హిందు, సిక్కు, బౌద్ధ మతాలు మినహా ఏ మతంలోకి మారినా, వారు ఎందులో పుట్టినప్పటికీ షెడ్యూల్డ్ కులాల సభ్యులుగా అంతవరకు పొందుతున్న గుర్తింపును కోల్పోతారు. ఒక వ్యక్తి ఒకసారి క్రైస్తవంలోకి మారి ఆ మత విశ్వాసాలను అవలంబిస్తూ వాటిని చురుకుగా బోధిస్తుంటే వారు ఇక ఎంతమాత్రం షెడ్యూల్డ్ కులస్తులుగా గుర్తింపు పొందజాలరు అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తున్నది."

* – న్యాయమూర్తులు పికె మిశ్రా, మన్మోహన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం

## వే'మన'పద్యం

**గంగ పారునెపుడు గదలని గతితోడ**
**మురికివాగు పారు మ్రోతతోడ**
**పెద్దపిన్నతనము పేర్మి యీఈలాగురా,**
**విశ్వదాభిరామ వినురవేమ.**



## సంపాదకీయం

# హానికరమైన న్యాయ జాప్యం

న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్ లో పడి పేరుకుపోవడానికి బాధ్యతను ఒక్క న్యాయవ్యవస్థ మీదకే నెట్టి వేయడం భావ్యం కాదని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా చేసిన వ్యాఖ్యను ఎవరూ తప్పుపట్ట లేరు.దేశావ్యాప్తంగా అయిదు కోట్ల ఏభై లక్షల కేసులు అపరిష్కృతంగా పడి ఉన్నాయి. ఇందులో 4.65 కోట్ల కేసులు జిల్లా న్యాయస్థానాల పరిధిలోనివి కాగా 63లక్షల కేసులు హై కోర్టుల కింద ఉన్నాయి. సుప్రీం కోర్టు పరిధిలో 9000 కేసులు పెండింగ్ లో ఉన్నాయి.ఇన్ని కేసుల పరిష్కారానికి ఎన్ని యుగాలు పడుతుందో ఊహించడం కష్టం.ఆలస్యంగా వెలువడే న్యాయం అసలు జరగని న్యాయం కిందే లెక్క.న్యాయదుర్భిక్షం కూడా ఆకలి, దాహం లాంటిదే. సకాలంలో న్యాయం అందకపోవడం వల్ల సామాజిక అశాంతి ప్రబలుతుంది.

దొంగ ఎవరో దొర ఎవరో తెలియని అయోమయస్థితి నెలకొంటుంది.3400 కేసులు ఏభై సంవత్సరాలకు పైగా పెండింగ్ లో ఉన్నాయంటే, అందులోని ముద్దాయిలు, సాక్షులు ఇంకా జీవించే ఉంటారని గట్టిగా అనుకో గలమా?గత పదేళ్ళుగా పెండింగ్ కేసులు ఏటా 2.8 శాతం వంతున పెరుగుతూ వచ్చాయి.ప్రజాస్వామ్యంలో ఒక కేసు ఒకేసారి పరిష్కారం కావడం కష్టం. కింది కోర్టు నుంచి హై కోర్టుకు, వివిధ ధర్మాసనాలకు చివరికి సుప్రీం కోర్టుకు వెళ్లడం వల్ల కేసులు కొలిక్కి రావడం సహజంగానే ఆలస్యమవుతుంది. ఒక్క నిర్దోషికైనా శిక్ష పడకుండా చూసే ప్రమోత్కృష్ట ఆశయ సాధన కోసం అప్పీళ్ళకు అవకాశం ఇవ్వడం తప్పనిసరి.అదే ప్రజాస్వామిక న్యాయం. అయితే ఇన్ని కోట్ల కేసులు పెండింగ్ లో కొనసాగడం వల్ల సమాజానికి తీవ్రమైన హాని వాటిల్లుతుంది. ఎంతోమంది కరడుగట్టిన నేరస్థులు శిక్ష పడకుండానే జీవితం చాలిస్తారు.ఇంతగా కేసులు పెండింగ్ లో ఉండడం సత్వర న్యాయ హక్కుకు తీవ్ర విఘాతమే.

ఇందువల్ల లక్షలాది మంది విచారణలోని ఖైదీలు జైళ్లలో మగ్గుతున్నారు వీరిలో పేదలు, నిరుపేదలే ఎక్కువ.న్యాయావసరాల ఖర్చు భరించలేక వారి తరపున వాదించేవారు లేక పొట్ట అయినా గడుస్తోంది అనే దృష్టితో జైలు గోడలకు అతుక్కుపోయి దశాబాలుగా అక్కడే మగ్గి పోతున్నవారెందరో! దేశంలోని జైళ్లలో 439, 119 మంది ఖైదీలకు సరిపడే వసతులు మాత్రమే ఉన్నాయి. 2023 డిసెంబర్ నాటికి ఉన్న ఖైదీల సంఖ్య 530,333.అంటే జైళ్లలో ఉండేవారు వాటి కెపాసిటీ కి మించిపోయారు. 120.8 శాతం ఉన్నారు.ఖైదీలు, విచారణలోని ఖైదీలు కిక్కిరిసిపోయినందున అక్కడ అనారోగ్యం ప్రబలు తున్నది. ప్రజాస్వామ్యాన్ని హాస్యాస్పదం చేస్తున్నది. అయితే ఇందుకు బాధ్యతను పూర్తిగా న్యాయవ్యవస్థపై పడేయడం సరైనది కాదు.ఆ విషయాన్నే జస్టిస్ దీపాంకర్ దత్తా ఇటీవల వివరించారు.న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయకపోవడం,ప్రభుత్వమే అతిపెద్ద లిటిగెంట్ గా మారిపోయి పెండింగు లను పెంచి పోషిస్తూ ఉండడం అసలు సమస్యలని జస్టిస్ దత్తా చెప్పారు. ప్రభుత్వం తగు విధంగా స్పందించి న్యాయ జాప్యాన్ని అరికట్టే ప్రయత్నాన్ని ఇప్పటికయినా ముమ్మరం చేయాలి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ట్రంప్ అంచనాలు తప్పాయా?

ఇరాన్‌పై అమెరికా తీసుకున్న తాజా సైనిక–రాజకీయ చర్యలుత, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక మలుపును సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో ఈ ఘర్షణను "త్వరగా ముగిసే పరిమిత యుద్ధం"గా భావించిన అమెరికా వ్యూహకర్తలు, ఇప్పుడు దీర్ఘకాలిక సంఘర్షణ, గ్లోబల్ ఆర్థిక ప్రభావాలు, మిత్ర దేశాలపై ఒత్తిడి వంటి అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం కోసం పూర్వాపరాలు, వ్యూహపరమైన అంచనాలు, ప్రస్తుత పరిస్థితులు అన్నీ విశ్లేషణకు వస్తాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన విధానం "శక్తి ప్రదర్శన ద్వారా వేగవంతమైన ఫలితం" అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. 2025లో ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, 2026లో వ్యూహాత్మక మౌలిక వసతులపై లక్ష్యబద్ధ దాడులు, మరియు "మ్యాక్సిమమ్ ప్రెషర్" విధానం– కలిసి ఇరాన్‌ను బలహీన పరచి త్వరగా వెనక్కి తగ్గిస్తుందని అమెరికా భావించింది. ట్రంప్ పలు సందర్భాల్లో ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని "తగ్గించాం, దాదాపు నిర్వీర్యం చేశాం" అని ప్రకటించడం కూడా ఈ అంచనాలకే సంకేతం.

కానీ వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఇరాన్ ప్రత్యక్ష యుద్ధానికి మాత్రమే కాకుండా అసమాన యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, గల్ఫ్ దేశాలపై పరోక్ష దాడులు, మిత్ర దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం వంటి చర్యల ద్వారా అది ప్రతిస్పందించింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20% ఈ మార్గం ద్వారా జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది. అమెరికా మొదట భావించిన కీలక అంచనా–ఇరాన్ నాయకత్వంపై దాడి చేస్తే దేశం వెనక్కి తగ్గుతుందన్నది. కానీ ఇరాన్ రాజకీయ వ్యవస్థ వ్యక్తి ఆధారితమైనది కాదు; అది సిద్ధాంత ఆధారిత వ్యవస్థ. ఖమేని వంటి నాయకుడిని లేదా సైనిక నాయకులను లక్ష్యంగా చేసుకున్నా, వ్యవస్థ కొనసాగుతుంది. అంతేకాక, ఇరాన్‌లో "బాహ్య శత్రువు" భావన ప్రజలను ఒకే జెండా కింద చేర్చే సామర్థ్యం కలిగి ఉంది. అందువల్ల నాయకత్వంపై దాడులు దేశాన్ని బలహీన పరచడంలో కంటే ప్రతిఘటనను పెంచే అవకాశమే ఎక్కువ.

అమెరికా మరో పెద్ద పొరపాటు–ఈ ఘర్షణ కాల వ్యవధిపై చేసిన అంచనా. ప్రారంభంలో ఇది కొన్ని రోజులు లేదా వారాల్లో ముగిసే ఘర్షణగా భావించబడింది. కానీ ఇది నాలుగు వారాలకు పైగా కొనసాగుతూ, మరింత తీవ్రతరమవుతోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, "త్వరగా ముగుస్తుంది" అన్న భావన ఇప్పుడు పూర్తిగా చెదిరి పోయింది. దీర్ఘ కాలిక యుద్ధం వైపు పరిస్థితి మళ్లింది. చమురు ధరల విషయంలో కూడా అమెరికా అంచనాలు తప్పి పోయాయి. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్‌కు సుమారు $70 ఉన్న చమురు ధరలు, ఇప్పుడు $100–$113 స్థాయికి చేరుకున్నాయి. ఇది కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి ఖర్చులు, రవాణా ఖర్చులు పెరగడానికి దారితీసింది. ఈ సంక్షోభం 1970ల ఎనర్జీ షాక్‌లను తలపించే స్థాయికి చేరే ప్రమాదం ఉంది. అమెరికా వ్యూహకర్తలు దీర్ఘకాలంలో చమురు ధరలు తగ్గుతాయని కూడా భావించారు. ఇరాన్



ప్రభావాన్ని తగ్గిస్తే "టెరర్ ప్రీమియం" తగ్గి ధరలు పడిపోతాయని వాదనలు వినిపించాయి. కానీ తక్షణ ప్రభావం పూర్తిగా వ్యతిరేకంగా వచ్చింది–మార్కెట్లలో అనిశ్చితి పెరిగి ధరలు మరింత పెరిగాయి. మిత్ర దేశాల అంశంలో కూడా అమెరికా వ్యూహం చిక్కుల్లో పడింది. యూరప్ వంటి దేశాలు ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధార పడటంతో, ఈ సంక్షోభం వారికి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చింది. గ్యాస్ ధరలు రెట్టింపు కావడం, పరిశ్రమలపై ప్రభావం, వ్యవసాయ రంగంలో ఇన్‌పుట్ ఖర్చుల పెరుగుదల–కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి.

అమెరికా మిత్ర దేశాలకు మరో సమస్య భద్రతా పరమైనది. ఇరాన్ స్పష్టంగా హెచ్చరించింది–అమెరికా మద్దతు ఇచ్చే దేశాలపై కూడా దాడులు చేస్తామని. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆయిల్ సదుపాయాలు లక్ష్యంగా మారే అవకాశం ఉంది. దీని వల్ల మిత్ర దేశాలు "అమెరికా నిర్ణయాల భారం" మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇక ఆర్థికంగా కూడా అమెరికా తానే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్ ధరలు పెరగడం, స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఒత్తిడి–కలిసి దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అంతేకాక, దీర్ఘకాల యుద్ధం జరిగితే అమెరికా సైనిక ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది.ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిన అంశం ఇక్కడ స్పష్టమవుతుంది. ఇరాన్ కేవలం ఒక దేశం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ ప్రభావ వ్యవస్థ. హిజ్బుల్లా, హూతీలు, షియా మిలీషియాలు వంటి మిత్ర బలగాల ద్వారా పరోక్ష యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం ఉంది. ఈ "మల్టీ–లేయర్డ్ వార్ స్ట్రాటజీ"ను అమెరికా పూర్తిగా అంచనా వేయలేక పోయింది.ట్రంప్ ప్రభుత్వం మూడు ప్రధాన అంచనాల్లో పొరపాటు చేసింది. మొదటిది–త్వరగా ముగిసే యుద్ధం అనే అంచనా. రెండవది–నాయకత్వంపై దాడి చేస్తే ఇరాన్ వెనక్కి తగ్గుతుందనే భావన. మూడవది–చమురు ధరలు మరియు గ్లోబల్ మార్కెట్లపై ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం.ప్రస్తుత పరిస్థితి చూస్తే, ఇది పరిమిత యుద్ధం నుండి విస్తృత ప్రాంతీయ ఘర్షణగా మారే ప్రమాదం కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధి సమస్య పరిష్కారం కాకపోతే, చమురు సరఫరా మరింత క్షీణించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముంది.అందువల్ల "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం–అవును, వ్యూహాత్మకంగా కొన్ని కీలక అంశాల్లో తక్కువ అంచనా వేసింది అని చెప్పాలి. అయితే ఈ ఘర్షణ ఇంకా ముగియ లేదు; తదుపరి పరిణామాలు అమెరికా వ్యూహం ఎంతవరకు మారుతుందో, ప్రపంచ శక్తి సమీకరణాలు ఎలా మారుతాయో నిర్ణయిస్తాయి.



సంగనబట్ల
9440595494

# ఆదివాసీ పట్టు దసలి!

" వెయ్యి పట్టు గూళ్లకు 5మీటర్ల వస్త్రం తయారవుతుంది. దీనితో తయారైన దుస్తులు శీతాకాలంలో వెచ్చగా, ఎండాకాలంలో చల్లగా ఉంటాయి. ఇదే దసలి పట్టులోని ప్రత్యేకత" అంటాడు మహదేవ్ పూర్ కి చెందిన నేత కార్మికుడు గొర్రె బాపన్న.

**దసలి పట్టు ఎలా సాగు చేస్తారు ?**

తెలంగాణలోని మహదేవ్ పూర్, మంచిర్యాల, అసిఫాబాద్, వరంగల్ అటవీ ప్రాంతాల్లో ఏరుమద్ది, నల్లమద్ది చెట్లు ఎక్కువగా పెరుగుతాయి. ఇవి దసలి పట్టుపురుగుల పెంపకానికి అనువుగా ఉంటాయి. దీంతో ఇక్కడ దసలి పట్టు పురుగుల విత్తనాలు ఉత్పత్తి చేసేలా స్థానిక గిరిజనులను పట్టు పరిశ్రమ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. పట్టుపురుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చి, ఉచితంగా గుడ్లను అందిస్తున్నారు. ఈక్రమంలో వందల సంఖ్యలో ఆదివాసీలు మద్ది చెట్లమీద పట్టు పురుగులను పెంచుతూ.. ఉపాధి పొందుతున్నారు. మిగతా రోజుల్లో కులవృత్తులు, ఉపాధి హామీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తారు.

" పట్టుగుడ్ల నుంచి వచ్చే లార్వా (గొంగలి పురుగు)ను నల్లమద్ది, తెల్లమద్ది చెట్లపై వదులుతాం. ఈ పురుగులు చెట్ల ఆకులను తింటూ, 25 నుంచి 35 రోజుల్లో పెద్దగా పెరిగి ఆ చెట్లమీదే పట్టుగూళ్లను అల్లుతాయి. గూళ్లు పూర్తిగా తయారైన తర్వాత వాటిని సేకరిస్తాం. దండలుగా కట్టి, షేడ్‌నెట్‌లో పరిరక్షిస్తుంటారు. కాయ అల్లిన 15 నుంచి 20 రోజుల తర్వాత వాటిలోంచి మాత్ (పెద్ద సీతాకోక చిలుక) బయటికి వస్తాయి. అక్కడే ఆడ, మగ మాత్‌లు కలుస్తాయి. తర్వాత ఆడ మాత్ గుడ్లు పెడుతుంది. ఇలా విత్తనాలను (గుడ్లను) ఉత్పత్తి చేస్తుంటాం. " అంటారు మంచిర్యాల సమీపంలోని చెన్నూరు రైతులు.

**పట్టులో దసలి పట్టు వేరయా...**

పట్టుపురుగుల్లో మల్బరీ, దసలి, మెగాసిల్క్, ఎరి సిల్క్, ఓక్ టస్సర్ అని ఐదు రకాలున్నాయి. మొదటి రకం.. మల్బరీ పట్టుపురుగులు. ఇవి మల్బరీ ఆకులను తిని గూళ్లను అల్లుతాయి. పంట పొలాలు, పట్టా భూముల్లో రైతులు వీటిని సాగు చేస్తుంటారు. రెండో రకం.. దసలి పట్టు పురుగులు. టస్సర్ సిల్క్‌నే దసలి అని అంటారు. టస్సర్ సిల్క్‌ను తొమ్మిది రాష్ట్రాల్లో పండిస్తున్నారు.

ఈ రాష్ట్రాలన్నిటికీ కలిపి దసలి పట్టుపురుగులకు సంబంధించిన కార్యాలయాన్ని బేసిక్ టస్సర్ సిల్క్‌వార్మ్ సీడ్ ఆర్గనైజేషన్ అంటారు. బిలాస్‌పూర్‌లోఉంది. ఇక మెగాసిల్క్. ఎరిసిల్క్, ఓక్ టస్సర్ ఈశాన్య రాష్ట్రాల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి. అక్కడి ప్రజలు ఎరిసిల్క్ రకాలను ఇంట్లోనే సాగు చేసుకుంటారు. పట్టును శాలువాలు, చద్దర్లు డెనిమ్ జీన్స్‌ల తయారీలో వాడుతారు. పట్టు పురుగుల్లో



మల్బరీ, దసలి, మెగాసిల్క్ కి ఎక్కువ ప్రాధాన్యత ఉంది.

**ఆదివాసీల బతుకు మారింది..**

సిర్‌పూర్ కాగజ్ నగర్ నుండి జయశంకర్ భూపాల్ పల్లి వరకు అడవుల్లో ఏరుమద్ది, నల్లమద్ది చెట్లు ఎక్కువగా పెరుగుతాయి. అలా ప్రకృతిసిద్ధంగా దసలి పట్టుతో ఆదివాసీ గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో సబ్సిడీలు పొందుతూ.. పెట్టుబడులు లేకుండానే లాభాల బాట పడుతున్నారు. ఏడాదిలో సగం రోజులు చేతి వృత్తులు.. మరో సగం రోజులు పట్టు పురుగుల పెంపకంతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. మరోవైపు పట్టుపురుగు విత్తనాల (గుడ్లు) ఉత్పత్తితో.. పట్టు పరిశ్రమకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

**రెండు వేల ఎకరాల్లో సాగు..**

" అడవి లో దొరికే అటవీ ఉత్పత్తులపై ఆధార పడి బతికే ఆదివాసీలకు సుస్థిర ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం దసలి పట్టుపురుగుల పెంపకాన్ని ప్రోత్సహించడానికి మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో అడవిలో 2000 ఎకరాల్లో వేరుమద్ది,నల్లమద్ది చెట్లపై దాదాపు 400 కుటుంబాలు దసలి పట్టు పురుగులను పెంచుతూ
పట్టుకాయలను ఉత్పత్తి చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరు ఏడాదికి రెండు నుండి మూడు పంటలు తీస్తూ మార్కెట్ ధరలను బట్టి 50 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. చెన్నూరులోని దసలి పట్టుపురుగుల విత్తనోత్పత్తి కేంద్రంలో ఏటా 2,లక్షల 50వేల పట్టు గుడ్లు ఉత్పత్తి అవుతుంటాయి. వీటికి దేశంలోనే మంచి డిమాండ్ ఉంది.
ప్రతీ రైతుకు 400 గ్రాముల పట్టుగుడ్లను 50శాతం సబ్సిడీ పై ఇస్తున్నాం. వీటితో పాటు కీటకాల నుండి రక్షణకు బ్లీచింగ్ పౌడర్ , సున్నం కూడా ఇస్తున్నాం. " అంటారు మంచిర్యాల జిల్లా సెరికల్చర్ అధికారి బోనోతు వెంకన్న.
చెన్నూరులో ఈ సారి 1,10,280 పట్టు గుడ్ల నుండి 35లక్షల పట్టుగూళ్ల దిగుబడి సాధించి దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది.

**మద్ది ఆకులే ఆహారం..**

దసలి పట్టుపురుగుల ముఖ్య ఆహారం ఏరుమద్ది (తెల్లమద్ది), నల్లమద్ది చెట్లు. వీటిని ప్రైమరీ ఫుడ్‌లాండ్స్‌గా వ్యవహరిస్తారు. దసలి పట్టుపురుగులు వీటి ఆకులను ఆహారంగా తీసుకొని పట్టు గూళ్లను అల్లుతాయి. చెన్నూర్‌లో పట్టు పరిశ్రమ శాఖ నిర్వహిస్తున్న నర్సరీలో లక్షా 50 వేల మొక్కలను పెంచుతున్నారు. సాధారణంగా పట్టుపురుగుల సీజన్ జూన్ నెల నుంచి డిసెంబర్ వరకూ ఉంటుంది. ఈ ఆరు నెలలు వారు పట్టుపురుగులను పెంచుతారు. మిగతా సమయంలో కుల వృత్తుల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు.

**పెట్టుబడి తక్కువే..**

" దసలి పట్టుపురుగు కాయకు పెట్టుబడి ఎక్కువగా అవసరం లేదు. రూ.3 వేలతో గుడ్లను కొనుగోలు చేస్తే సరిపోతుంది. అయితే, ఈ గుడ్లు పిల్లలు అయ్యేవరకూ జాగ్రత్తగా కాపాడుకోవాలి. గుడ్ల నుంచి పట్టుపురుగులు బయటికి వచ్చిన తర్వాత వాటిని చెట్లపై వేస్తారు. పట్టుపురుగులు ఆకులను తింటూ 20 రోజులకు దసలి పట్టుకాయలుగా మారుతాయి. ఈ సమయంలో పట్టుపురుగులను పక్షులు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రెండు నెలలపాటు కష్టపడితే కాయ చేతికి అందుతుంది." అంటారు రైతులు.

**టస్సార్ కాలనీ..**

భారత దేశంలో దసలిపట్టు (టస్సార్ సిల్క్) ఉత్పత్తి అస్సాం, బీహార్ ,తెలంగాణలో మాత్రమే ఉంది. జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా, మహదేవ్ పూర్‌లో దసలిపట్టు వస్త్రాల నేత కార్మికులకు ఏకంగా 'టస్సార్ కాలనీ 'ఉంది. రైతులు దగ్గర పట్టు గూళ్లను ఈ కాలనీ వాసులు కొనుగోలు చేసి, ఆ పట్టు గూళ్ల నుండి దారం తీసి,మగ్గం పై నేస్తారు. మహదేవ్ పూర్ దసలి పట్టు దుస్తులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అటవీ ప్రాంతంలో పెరిగిన పట్టుపురుగుల నుండి దారం తీసి చేతివృత్తి నైపుణ్యంతో నేయడం వల్ల ప్రత్యేకత సంతరించుకుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో పూజాకార్యక్రమాల్లో దేవతామూర్తులకు ఈ వస్త్రాలను సమర్పిస్తారు. నాణ్యమైన దసలిపట్టు దుస్తులు ఇక్కడే తయారవుతాయి. ఈ పనిలో 84 కుటుంబాలు జీవిస్తున్నారు.

దసలిపట్టుపురుగుల పెంపకం చాలా కష్టం. గుడ్లనుండి పురుగులు బయటకు రాగానే మద్ది చెట్లపైనే పెంచుతూ కంటికి రెప్పలా కాపాడుతారు. కీటకాలు,చీమలు,కోతులు నుండి వాటిని కాపాడడానికి చాలా కష్ట పడతారు. ఈ శ్రమలో మహిళలే ముందుంటారు.



శ్యాంమోహన్
9440595858

# మన మహా నాయకులూ..
# వాళ్ళ రాజకీయాలు

రాజకీయ నాయకుల చిత్రమైన పద్ధతులు చూస్తుంటే మనం ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా అని అనుమానం కలుగుతుంది. ఎంత భూస్వాములమని చెప్పుకున్నా, 30 –40 సంవత్సరాల క్రితం వీళ్ళంతా మధ్యతరగతి జీవులే. వీళ్ళు చేసిన భూమి దోపిడీ, ఇతర నిరంకుశత్వాల కారణంగా తెలంగాణ గ్రామాల్లో ఆ కాలంలో నక్సలైట్ ప్రభావం వల్ల గుండె అరచేతిలో పెట్టుకొని పట్నం దిశగా పారిపోయిన వాళ్లే. అలాంటి కుటుంబాల్లో అనేకులు రాజకీయాల్లో ప్రవేశించి తర్వాత ఎదిగి ఈరోజు ఏ స్థితిలో ఉన్నారో మనందరికీ తెలుసు. ఒక ఎమ్మెల్యేకు నెలవారీ జీతం రెండు లక్షల డెబ్బై అయిదు రు. వరకు ఉంటుంది. ముఖ్యమంత్రి కైనా నాలుగు లక్షల వరకు వేతనం ఉంటుంది. ఈ ఆదాయాలతో ఎవరైనా ఎట్లా కోట్లకు పరుగెత్త గలరు? ఇక వీళ్లే మళ్ళీ వేదికలెక్కి లంచగొండితనాన్ని నశింప చేస్తామని పెద్ద పెద్ద డైలాగులు చెప్తారు. సెంటిమెంట్లు రెచ్చగొడతారు. అవసరమైతే ఏడుస్తారు. వీళ్ళు చేసే నటన ముందు ఏ మహానటులు పనికిరారు. గాంధీజీ అంటారు, "politics without moral principles is one of the greatest evils" అని. . Political corruption అధిగమించకపోతే ఈ దేశం స్థితి ఏనాటికైనా ఇంతే ఉంటుంది.

ఇక రాజకీయ నాయకుల stage performance ప్రత్యేకించి చెప్పుకోవాల్సిందే. ప్రజలను నమ్మించడానికి వీళ్లు వేసే వేషాలు ఇంత అంతా అని కాదు. ఇంత చేసినా వీళ్ళ అభినయ పర్వంలో తెలంగాణ ఉద్యమం నాటి నుండి భాష కూడా పూర్తిగా మారిపోయింది. ఏ డిక్షనరీ చూపించని పదాలు, ఎప్పుడో ఆవేశం వస్తే తప్ప, సాధారణ మానవులు ఎవరూ వాడని పదాలు, వీళ్ళ ఉత్తుత్తి ఆవేశ ప్రదర్శనకు దోహదకారులౌతున్నాయి. ఉద్యమం సమయంలో వాడిన భాష సరే.... కానీ రాష్ట్ర సాధన జరిగి స్థిమితం వచ్చాక, అధికారం చేపట్టాక కూడా ఈ దురవస్థ కొనసాగింది. అధికారం మారినాక కూడా "అతనికంటే ఘనుడు అల్లుడు మల్లన్న" అన్నట్టుగా ఇంకో రెండు ఆకులు ఎక్కువై కొనసాగుతున్నది. ఏ భాష వల్ల అధికారం వచ్చిందని జబ్బలు చరుచుకున్నారో ఆ భాషే వాళ్లని ఓడించిందని తెలుసుకోలేకపోతున్నారు. ఈ బూతుల పంచాంగం ఎవరు ప్రారంభించారు అనేది సరే.. ఎవరు ముగిస్తారు అనేదే ప్రధానం. ఐ.పి.సి సెక్షన్ 294 ప్రకారం వేదికల మీద అసభ్యంగా మాట్లాడితే మూడు నెలల వరకు జైలు శిక్ష ఉంటుంది. ఐ.పి.సి . సెక్షన్ 504 ప్రకారం ఎవరినైనా ఉద్దేశ పూర్వకంగా అవమాన పరుస్తే రెండు సంవత్సరాలవరకు జైలు శిక్ష ఉంటుంది. ఐ.పి.సి సెక్షన్ 509 మహిళలను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడితే మూడు సంవత్సరాలవరకు జైలు శిక్ష ఉంటుంది. చట్టాలను నిర్మించే వాళ్ళే ఇంత బరి తెగిస్తే ఇక సామాన్యుల సంగతేమిటి ?

ఇక రాజకీయ నాయకులు ప్రత్యర్థులను తిట్టడమే కాకుండా, ఆరోపించడం కూడా అత్యంత దారుణంగా ఉంటుంది. ఈ ఆరోపణలను న్యాయస్థానాలు ఎందుకు సుమోటాగా స్వీకరించకూడదు? సెక్షన్ 248, False charge with intent to injure ప్రకారం ఎవరైనా సరే , ఏ హోదాలో ఉన్న సరే ,తప్పుడు నేరారోపణ చేస్తే 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుంది. ఈ గాలి వాటం నాయకులకు, వాళ్ళ పార్టీలకు ఒక సిద్ధాంతం ఉండదు. ఒక ప్రాపంచిక దృక్పథం ఉండదు. ఒక్క బిజెపి, మరియు లెఫ్ట్ పార్టీలకు తప్ప ఒక ప్రత్యేక విధానం ఎవరిలోనూ కనబడదు. పార్టీలు ఫిరాయించడానికి కూడా ఇట్లా ప్రత్యేక విధానం లేకపోవడమే ప్రధాన కారణం. ప్రపంచ ప్రతతజాస్వామ్య దేశాల ముందు ఈ పార్టీల ఫిరాయింపు (మన తెలుగు రాష్ట్రాలలో) ఒక ప్రహసనంగా మారింది. తన సొంత ఆస్తుల పరిరక్షణో, లేక అధికారంలో ఉండాలని కోరికో, ఈ నాటకం కొనసాగుతూనే ఉన్నది. "Constitutional values fail when political leaders lack ethical responsibility". అంటాడు అంబేద్కర్.ప్రపంచ దేశాలలో భారతదేశం ఒక లోప భూయిష్ట పజాస్వామ్యంగా (flawed democracy ) గానే చూడ బడుతున్నది.నార్వే, స్వీడన్, డెన్మార్క్ ,ఫిన్లాండ్ ,న్యూజిలాండ్ , కెనడా, ఆస్ట్రేలియా ఉత్తమ ప్రజాస్వామిక దేశాలుగా నిలుస్తున్నాయి. ఆస్ట్రేలియాలో ఈ రచయిత కొద్దికాలం ఉండడం వల్ల ఇక్కడి పరిస్థితులు కొన్ని తెలియవచ్చాయి. వెస్ట్ ఆస్ట్రేలియా (premier ) ప్రీమియర్(అంటే మనదగ్గర ముఖ్యమంత్రి) రోజర్ కుక్ (Roger cook)) సాధారణంగా వేలార్డ్, మరియు తాను గెలిచిన కాన్ స్టెన్సీ క్వినాన కాఫీ సెంటర్లలో కాఫీ తాగుతాడు. ఒక సారి క్వినానాలోని ఫోన్ సెంటరు లో తన సెల్ ఫోన్ రిపేర్ చేసుకుంటుంటే తెలంగాణకు చెందిన సాకేత్ అనే సీనియర్ బిసినెస్ అనలిస్ట్ ఆయన్ని కలిశాడు. వేలార్డ్ లో కొత్త ఉన్నత పాఠశాల నిర్మాణం గురించి అడిగితే సానుకూలంగా స్పందించాడు. తరువాత సాకేత్ తన స్కూల్ గురించిన అభ్యర్థనను మెయిల్ లో పంపించాడు. ప్రేమియర్, వేలార్డ్ పాత స్కూల్‌కి వచ్చాడు. ఒకే కారు. ఆయనకు గన్ లేకుండా ఉన్న ఒక బాడీ గార్డ్ . ఒక లేడీ పి.ఏ . ఇదీ ఆయన సిబ్బంది. సాకేత్ వెళ్లి మళ్ళీ ఆయన్ని కలిశాడు. కొత్త స్కూల్ గ్రాంట్ గురించి చర్చించాడు. ఇండియాలో సాధారణమైన ఎం.ఎల్.ఏ వస్తేనే ఎంత హడావిడి ? సి.ఎం . వస్తే ఆ కాన్వాయ్ కే ఎంత ప్రజల డబ్బు వృథా అవుతుంటుంది ?

కాగా తెలంగాణాలో బి.సిల పట్ల, బహుజనుల పట్ల సానుకూలత చూపించే కొత్తగొంతులు కొన్ని వినిపిస్తున్నాయి. సామాజిక తెలంగాణ అనేది జోడించి చెబుతున్నారు.కొత్త రాగం పలికే ఏ నాయకులైనా తమ వాగ్దానాలకు ఒక ప్రామాణికత చూపించాల్సి ఉంటుంది.



కాంచనపల్లి
గోవర్ధన్ రాజు
9676096614
తెలుగు విశ్వవిద్యాలయం
అధ్యాపకుడు



# గ్రేటర్ హైదరాబాద్



## ఫ్లై ఓవర్ జూన్‌లోగా పూర్తి చేయాలి

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్**



**హైదరాబాద్, 24 మార్చి (ఉదయం):** చంచల్‌గూడసంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను జూన్ లోగా పూర్తి చేయాలనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నిర్మాణంలో ఉన్నసంతోష్‌నగర్ ఫ్లై ఓవర్ పనులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులను మరింత స్పీడ్ అప్ చేయాలని అధికారులకు సూచించారు. ఫ్లై ఓవర్ పనుల పూర్తికి జూన్‌ను డెడ్ లైన్‌గా పెట్టుకోవాలన్నారు. తనిఖీలో కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

**విద్యార్థులకు ఆరోగ్యం, ఆత్మరక్షణపై అవగాహన**



**చేవెళ్ల, మార్చి 24 (ఉదయం) :** చేవెళ్ల మండలం పరిధిలోని కమ్మెట గ్రామంలో మంగళవారం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ఆరోగ్యం మరియు ఆత్మరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.కరాటే బ్లాక్ బెల్ట్ హోల్డర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన,ఈ కార్యక్రమం విద్యార్థినులకు ఆత్మరక్షణ పద్ధతులపై ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. ప్రమాదకర పరిస్థితుల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలి, ప్రత్యర్థిని ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.అలాగే, సామాజిక బాధ్యతగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామంలో తిరిగి యువత, గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.డ్రగ్స్ అనే మహమ్మారి యువతపై చూపే దుష్ప్రభావాలు, వారి భవిష్యత్తును ఎలా దెబ్బతీస్తుందో వివరించారు.కార్యక్రమం అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ ఎం. రమేష్ బాబు, హిస్టరీ లెక్చరర్ మహేందర్ గౌడ్ మరియు హై స్కూల్ ఉపాధ్యాయ బృందం కలిసి కరాటే మాస్టర్ శ్రీనివాస్‌ను సన్మానించారు.

## సీనియర్ జర్నలిస్ట్‌కు ఉగాది పురస్కారం



**కుత్బుల్లాపూర్, మార్చి 24 (ఉదయం ప్రతినిధి) :** విపంచి ఫౌండేషన్ ఉగాది పురస్కారంను సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్ సోమవారం రవీంద్రభారతి లో జరిగిన కార్యక్రమంలో ఏనుగు నర్సింహారెడ్డి ఐ ఏ ఎస్ చేతుల మీదుగా ప్రముఖుల సమక్షంలో ఉగాది పురస్కారం అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలలో కృషి చేస్తున్న విపంచి ఫౌండేషన్ ప్రతీ ఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మక పురస్కారానికి సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్ ను విపంచి ఫౌండేషన్ ప్రత్యేక జూరి కమిటీ ఎంపిక చేసింది. పత్రికా రంగంలో టి రమేష్ చేస్తున్న కృషికి గాను ఈ అవార్డును ప్రకటిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు (ఎం ) కు చెందిన రమేష్ భువనగిరి లో డిగ్రీ చదువుకున్న సమయం నుండే జర్నలిజం పై ఆసక్తితో పలు పత్రికలో స్థానిక సమస్యలకు స్పందిస్తూ సుమారు 30 సంవత్సరాల నుండి సాహిత్య పరిశోధక వ్యాసాలతో తెలుగు భాషా సాహిత్యానికి తనవంతు సేవలు అందిస్తున్నాడని అన్నారు. చిన్న వయస్సులోనే సాహితీ మాగాణంలో చెరగని ముద్రను వేసుకున్నాడని తెలిపారు. జర్నలిస్ట్ టి.రమేష్ నేడు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్ లో మరిన్ని రచనలు చేసి తెలంగాణకు మరింత ఖ్యాతిని తీసుకురావాలని కాంక్షించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT: AT HYDERABAD**
**O.S. No.4764 OF 2021**

**Between:**
Srikanth Enterprises
...Plaintiffs

**AND**

G. Narsamma & another
...Defendant

To,
Gangalu Mallesh S/o. Jangaiah
Aged 36 years, occ: Business
R/o. C/o. D. Gandamma
R/o. H.No. 18-3-463/1/199, Shivajinagar
Laxminagar, Hyderabad - 53.
....Defendant No.2

WHEREAS the above-named plaintiff filed the above suit against the defendants seeking recovery of money. The said suit stands posted to 06-04- 2026 for your appearance.

Therefore, you are hereby directed to appear before the above said Court on the above said date at 10-30 AM in person or by Pleader duly instructed by you, positively, failing which the matter will be heard and determined ex-parte.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**K. SHASHIDAHR (TS/1963/2005)**
**Advocate**
**H.No. 1-10-122/26, 1st Floor**
**Street No. 8, Ashok Nagar,**
**Hyderabad-500020,**
**Cell. No 9848051273,**
**Email ID shashiattorney@yahoo.com.**
**Cell No. 8341760104**


## జిహెచ్‌ఎంసి అధికారుల నిర్లక్ష్యం



**గుర్రపు డెక్క తీశారు తీసుకెళ్లడం మరిచారు**

- ఇది బోడుప్పల్ సర్కిల్ జిహెచ్‌ఎంసి అధికారుల పనితీరు
- నెల రోజులైనా పట్టించుకోని జిహెచ్‌ఎంసి అధికారులు
- అభయాంజనేయ స్వామి గుడి ఎదుట పేరుకుపోయిన గుర్రపు డెక్క చెత్త
- శ్రీరామనవమి సమీపించడంతో భక్తుల్లో తీవ్ర అసంతృప్తి

**మేడిపల్లి, మార్చి 24 (ఉదయం ప్రతినిధి)** బోడుప్పల్ జిహెచ్‌ఎంసి సర్కిల్ పీర్జాదిగూడ డివిజన్లోని మినీ ట్యాంక్ బండ్ లో దోమల నివారణ కోసం సుమారు నెల రోజుల క్రితం జిహెచ్‌ఎంసి అధికారులు గుర్రపు డెక్క ను తీయించి చెరువు సమీపంలోని ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ముందు వేశారు సగానికి పైన తరలించిన అధికారులు మిగిలిన సగం తీసిన గుర్రపు డెక్క చెత్తను అలాగే వదిలేశారు, ఆ చెత్త కుళ్ళిపోయి దుర్వాసనను వెదజల్లుతూ.. గుడికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందికి గురిచేస్తుంది పలుమార్లు స్థానికులు అధికారులకు ఈ సమస్య గురించి విన్నవించుకున్న జిహెచ్‌ఎంసి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తుతారు, కానీ ఈ సంవత్సరం ఇప్పటివరకు గుడి ఆవరణలో ఉన్న గుర్రపు డెక్క చెత్తను అలాగే వదిలేశారు. ఇప్పటికైనా జిహెచ్‌ఎంసి అధికారులు శ్రీరామనవమి పండుగను దృష్టిలో పెట్టుకొని వెంటనే గుర్రపు డెక్క చెత్తను తరలించాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



## న్యాయవాదుల హర్షం



**చేవెళ్ల,మార్చి24 (ఉదయం) :** తెలంగాణ ప్రభుత్వం అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలపడంతో రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. గతంలో న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, హత్యల నేపథ్యంలో రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని న్యాయవాదులు ఎన్నో సంవత్సరాలుగా పోరాటం కొనసాగించారు. ఇటీవల చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ స్వప్న హత్యతో ఈ డిమాండ్ మరింత ఉధృతమైంది.స్వప్న హత్య అనంతరం చేవెళ్లలో భారీ ర్యాలీలు నిర్వహించడంతో పాటు, ఆమన్గల్ బార్ అసోసియేషన్ మద్దతుతో అసెంబ్లీ ముట్టడి విధుల బహిష్కరణ, నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ నిరసనల ఫలితంగా ప్రభుత్వం అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు ఆమోదం తెలిపింది.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మధుసూదన్ రెడ్డి, సురేందర్, గీతా వనజాక్షి, మాధురి, జైపాల్ మాట్లాడుతూ..."న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఈ బిల్లు కీలకంగా మారుతుంది" అని పేర్కొన్నారు. గతంలో వామన రావు దంపతుల హత్య జరిగినప్పుడు చర్యలు తీసుకుని ఉంటే స్వప్న వంటి ఘటనలు నివారించవచ్చని వారు అభిప్రాయపడ్డారు.న్యాయవాదులు శ్రీనివాస్, చొక్కంపేట రవీందర్ మాట్లాడుతూ..."స్వప్న హత్య చాలా బాధాకరం. ఆమె హత్యకు కారణమైన వారికి ఎలాంటి బెయిల్ ఇవ్వకూడదు. కఠిన శిక్ష పడితేనే ఆమె ఆత్మకు శాంతి చేకూరుతుంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మొకరం నర్సిములు, స్పోర్ట్స్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు తలారి ప్రకాశం, ప్రదీప్ రెడ్డి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీకి ఊతం

**చేవెళ్లలో ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా పంపిణీ**



**చేవెళ్ల, మార్చి 24(ఉదయం) :** వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించే దిశగా చేవెళ్లలో కీలక కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా రైతులకు డ్రోన్‌ను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా షాబాద్ రైతు ఫుడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు రాయితీపై అగ్రికల్చర్ డ్రోన్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా రైతుల ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు.డ్రోన్ సాంకేతికతతో ఎరువులు, పురుగుమందులను వేగంగా మరియు సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చని, దీని వల్ల సమయం ఆదా కావడంతో పాటు రైతులకు లాభదాయకంగా మారుతుందని తెలిపారు.రైతులు ఇలాంటి ఆధునిక పరికరాలను వినియోగించి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు బండారి ఆగి రెడ్డి, కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు శంకర్, ప్రభాకర్, మాజీ సొసైటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు రైతులు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## స్కౌట్స్ గైడ్స్ యూనిట్ ప్రారంభం

**క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం పెంపొందించాలి**



**చేవెళ్ల, మార్చి 24 (ఉదయం) :** తెలంగాణ మోడల్ స్కూల్ చేవెళ్లలో స్కౌట్స్, గైడ్స్ యూనిట్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్సై శిరీష ముఖ్య అతిథులుగా హాజరై యూనిట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ భూపాల్ శ్రీధర్, మాట్లాడుతూ...స్కౌట్స్ మరియు గైడ్స్ కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉన్నత నైతిక విలువలు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రస్తుతం యువతలో ఆత్మవిశ్వాసం లోపం కారణంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, స్కౌట్స్, గైడ్స్‌లో చేరడం ద్వారా ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని చెప్పారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు సహపాఠ్య కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని, తల్లిదండ్రుల మాట వినాలని సూచించారు. బాల్యం నుంచే దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ వంటి విలువలను అలవర్చుకోవడం అవసరమని పేర్కొన్నారు.పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వినోద్ కుమార్ మాట్లాడుతూ... స్కౌట్స్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు విపత్తుల సమయంలో సహాయక కార్యక్రమాలు మ్యాప్ ద్వారా దారులు గుర్తించడం, డేరాలు ఏర్పాటు చేయడం వంటి ప్రాయోగిక శిక్షణ అందిస్తామని తెలిపారు. ఆరవ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశ, ప్రథమ, ద్వితీయ సోపాన పరీక్షలు నిర్వహించబడతాయని, తృతీయ సోపానంలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందిస్తామని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి "రాజ్య పురస్కార్" శిక్షణకు ఎంపిక చేసి, ఉత్తీర్ణులైన వారికి రాష్ట్రపతి పురస్కారం అందజేస్తారని స్కౌట్ మాస్టర్ ఆంజనేయులు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుమ్మడిదలలో కలెక్టర్ పర్యటన



**గుమ్మడిదల, మార్చి 24 (ఉదయం) :** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం గుమ్మడిదల మండలంలో విస్తృతంగా పర్యటించారు. నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సాగుతున్న ఉద్యానవన పంటలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.
నల్లవల్లి గ్రామంలో తోటల పెంపకం, సాగు విధానాలు, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలపై అధికారులను ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నాణ్యతను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.
ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల నమోదు ప్రక్రియను తనిఖీ చేసి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఔషధ శాల, పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు.
ఈ పర్యటనలో తహసిల్దార్ పరమేశం, ఎంపీడీవో ఉమాదేవి, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మండల వైద్య అధికారి డా. మధుకర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ



**కుత్బుల్లాపూర్, మార్చి 24 (ఉదయం ప్రతినిధి ):** తెలంగాణ జాతిపిత,సిద్ధాంతకర్త, ఉద్యమ నాయకులు, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ ప్రగతినగర్ అలీవ్ సర్కిల్ లో ఆచార్య జయశంకర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ ఆర్గనైజషన్ సెక్రటరీ సాంబా శివారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయులు అని, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేణుగోపాల్ రావు,శివ కుమార్, రవి కుమార్,వీర్ రాజ్, సందీప్,ఈశ్వర్, బిఆర్ఎస్ నాయకులు భిక్షపతి, అరిగే ముత్యాలు, మేడ సంజీవ, జలగం చంద్రయ్య, రామ్ నర్సయ్య, నిరుడు యాదగిరి, అనిల్ కుమార్, డి.శ్రీను, కురుమూర్తి, మహేష్, మహిళా నాయకులు భారతి, సుకన్య, హేమామి, స్వర్ణ కుమారి, ప్రమీల, రమా,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక భరోసా సిఎంఆర్‌ఎఫ్



**కుత్బుల్లాపూర్, మార్చి 24 (ఉదయం ప్రతినిధి) :** చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ రాజీవ్ గృహకల్పకు చెందిన వావిలాల పూర్ణిమకు రూ.6 లక్షలు, ప్రగతినగర్ కు చెందిన రోళ్ళకంటి రాజుకు రూ 2 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఎల్ ఓ సి పత్రాలను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరుశ సత్యనారాయణ, వి.వెంకటేశ్వర్ రెడ్డి, రోళ్ళకంటి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE XY JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD**
**0.S.NO. 718 OF 2026**

**Between:**
1.Smt. B. Varalakshmi
W/o. Late. B. Jagadishwara Chary.
aged 75 years, Occ: House Hold.
2. B. Santosh kumar
S/o Late. B. Jagadishwara Chary,
aged : 47 years, Occ: Private Employee,
3. Smt. B. Sirisha ( W/o P. Anjanelyulu)
D/o Late. B. Jagadishwara Chary,
aged :41 years, Occ: House wife,
Add: R/o 15-9-554/3 Mahaboob gunj, V.T.C
Nampally, Begum bazaar, Hyderabad, T.S - 500012
...Plaintiffs

**AND**

1. The Tahsildar Nampally Mandal,
2. O/o Nampally Mandal, Hyderabad
All Concerned
...Defendant

To.
All Concerned.

Whercas, the above named plaintiffs filed the above suit to declare them as legal heirs of Late. B. Jagadishwara Chary, and suit IS posted on 09-04-2026 at 10:30 AM for your appearance. For any Objections / Claims, If no objections are received on the said date, the matter will be decided on merils,

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**M/s. K. Venugopala Chary**
**Awala Vineeta**
**Advocates**
**Office at: Flat No. 2 Block -4, HIG(OG), APHB, Baghlingampally. Hyd. T.s**


## మానవత్వం చాటుకున్న కేకే కృష్ణ

**హలో షాద్‌నగర్ కేపి కథనంతో స్పందించిన కాంగ్రెస్ నాయకుడు కేకే కృష్ణ**



**షాద్‌నగర్ మార్చి 24 (ఉదయం):** ఇల్లు కాలిపోయింది.. కంటి ముందే బూడిద మిగిలింది.. శిధిలమైన గోడలను చూసి కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది.. షాద్‌నగర్ పట్టణంలోని 19వ వార్డులో నెహ్రూ కాలనీకి చెందిన పిట్టల శీను, విజయలక్ష్మి దంపతుల ఇల్లు అగ్నికి ఆహుతి అయిన సంగతి తెలిసిందే. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగింది. ఇలాంటి సమయంలో "హలో షాద్ నగర్ కేపి" ద్వారా సీనియర్ జర్నలిస్టు కేపీ రాసిన కథనానికి స్పందించిన జిల్లేడు చౌదరిగూడ కాంగ్రెస్ యువనేత, సామాజికవేత్త కేకే కృష్ణ నేరుగా సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తక్షణసాయంగా నిత్యావసరాల నిమిత్తం రూ. 10 వేలు నగదు ప్రకటించారు. అంతేకాకుండా కాలిపోయిన కొత్త ఇంటిని పునరుద్ధరించి కుటుంబ సభ్యులకు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), అక్కడికి విచ్చేసిన కౌన్సిలర్లు గోపాల్, జిటి శ్రీనివాస్ తదితరులతో మాట్లాడారు. హలో షాద్ నగర్ కేపీ రాసిన వార్తకు చలించి బాధితులను పరామర్శించడానికి వచ్చినట్లు తెలిపారు.

**ఇలాంటి పరిస్థితి ఎవరికి రావద్దు : కేకే కృష్ణ**

ఇలాంటి పరిస్థితి ఏ పేదవాడికి రాకూడదని తన వంతు సాయం చేసేందుకు తాను సిద్ధమని కాంగ్రెస్ పార్టీ యువ నేత సామాజికవేత్త కేకే కృష్ణ స్పందించారు. బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి పరిస్థితి ఏ కుటుంబానికి రాకూడదని, విధిరాత రాసిన రాతను మార్చేందుకు దాతగా ముందుకు వచ్చానని వెల్లడించారు. ఆ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. సీనియర్ జర్నలిస్టు కె.పి, 19 వార్డు కౌన్సిలర్ మొహమ్మద్ ఎజాజ్ అడ్డు, 20వ వార్డు కౌన్సిలర్ పినమోని గోపాల్, 21వ వార్డు కౌన్సిలర్ జిటి శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నిరుపేద కుటుంబానికి కష్టం వచ్చిన వెంటనే అక్కడికి చేరుకున్న కేకే కృష్ణ సాయం అందించడం ద్వారా అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కేకే కృష్ణ ఔదార్యానికి హలో షాద్ నగర్ కేపీ కృతజ్ఞతలు తెలిపారు..

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు




## క్షయ రహిత జిల్లా మనందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి
- వరంగల్‌లో ఘనంగా ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం
- 'ఎస్..! వి కెన్ ఎండ్ టిబి' థీమ్‌తో అవగాహన ర్యాలీ

**వరంగల్, మార్చి 24 (వుదయం జిల్లా ప్రతినిధి) :** వరంగల్ జిల్లాను క్షయ (టిబి) రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా 'ఎస్..! వి కెన్ ఎండ్ టిబి' (Yes..! We Can End TB) అనే నినాదంతో నిర్వహించిన అవగాహన ర్యాలీని అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. సికేఎం కాలేజ్ జంక్షన్ నుండి దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ఈ ర్యాలీ కొనసాగింది.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధి అంటువ్యాధి అయినప్పటికీ, సరైన సమయంలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని తెలిపారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించి, బాధితులకు తక్షణ పరీక్షలు, ఉచిత చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. రోగులకు 'పోషణ అభియాన్' కింద అందాల్సిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించాలని సూచించారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజల అవగాహన పెరగడం వల్ల క్షయ కేసులు తగ్గుముఖం పడుతున్నాయని వివరించారు. గత ఏడాది 1,263 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 298 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. వైద్య సిబ్బంది నిరంతరం శ్రమిస్తే జిల్లాను టీబీ రహితంగా మార్చడం సాధ్యమేనని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు కావేటి కవిత రాజు, సురేష్ జోషి, బస్వరాజ్ కుమారస్వామి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, డాక్టర్ విజయకుమార్, వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్, టీబీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సురేందర్, ఆశా కార్యకర్తలు, మేధా నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ ప్రగతికి పునాది ప్రతి కుటుంబం ఆరోగ్యం

- టీబీపై పోరాటం మన అందరి బాధ్యత
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 24(వుదయం జిల్లా ప్రతినిధి):** ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందనీ టీబీపై పోరాటం మన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు మంగళవారం ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన టీబీ దినోత్సవంలో మున్సిపల్ కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత టీబీ స్క్రీనింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

టీబీపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని సూచించారు.ప్రభుత్వం టీబీ నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని ముఖ్యంగా టీబీ రహిత తెలంగాణ కోసం మన జిల్లాకు మొబైల్ ఎక్సరే మిషన్ ను అందించడం జరిగిందని అన్నారు.

జిల్లా లో టీబీ నిర్మూలనకు 35 గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలలో మొబైల్ ఎక్సర్ ద్వారా ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ చేపట్టి 6 నెలలు పాటు చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. లక్షణాలు గుర్తించిన వ్యక్తులకు ఉచిత వైద్య సేవలతో పాటు పోషణ కిట్లను సైతం అందించడం జరుగుతుందని తెలిపారు




మున్సిపల్ కార్మికులు, ఆశా కార్యకర్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సైనికులని అభినందించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యాచరణలో భాగంగా మున్సిపల్ కార్మికులకు, ఆశా సిబ్బందికి ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని, మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధిసోకిన వ్యక్తులను గుర్తించి వైద్య సేవలు అందించి పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా మార్చాలని తెలిపారు. వైద్యసేవలు అందించే వైద్య సిబ్బంది ప్రజలకు దేవుళ్ళతో సమానమని తెలిపారు.అనంతరం మొబైల్ ఎక్స్ రే ద్వారా మున్సిపల్ కార్మికుల కు ఛాతీ ఎక్స్ రే తీయు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య సైతం ఎక్స్ రే తీపించు కున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్ అప్పం కిషన్, వైద్యులు డా ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య, వైద్యం

## ప్రభుత్వ సంస్థలదే ప్రధాన బాధ్యత: కలెక్టర్

- ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు నాణ్యమైన సేవలకు ప్రతీకలుగా నిలవాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 24 (వుదయం ప్రతినిధి)** ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ఆదర్శ కేంద్రాలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన, ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యా మరియు వైద్య సేవల అమలును సమగ్రంగా పరిశీలించారు.మొదటగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, మందుల గది, ప్రయోగశాల , ఇన్‌పేషెంట్ విభాగం, స్టాక్ రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. అవుట్‌పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి, రోజువారీగా వచ్చే రోగుల సంఖ్యపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవుట్‌పేషెంట్ వార్డులో ఉన్న ఒక బాలుడితో మాట్లాడి, కుక్క కాటు టీకా కోసం వచ్చినట్లు తెలుసుకుని, టీకాలు అందుబాటులో ఉన్నాయా అని విచారించారు.అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఏ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారో, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. తనిఖీ సమయంలో మెడికల్ అధికారి అందుబాటులో లేకపోవడంతో కారణాలను ప్రశ్నించగా క్షేత్రస్థాయిలో పర్యటనలో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు, వెంటనే మెడికల్ అధికారిని పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది సిబ్బంది యూనిఫాం ధరించకపోవడాన్ని గమనించి, విధి సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు.సిబ్బంది డిప్యూటేషన్‌పై అధిక సంఖ్యలో విధులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించి, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు.





అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తూ, ఇటీవల జరిగిన ఇంగ్లీష్ పరీక్షపై విద్యార్థులను అడిగి తెలుసుకుని, రాబోయే గణిత పరీక్షకు క్రమబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించి, సులభ పాఠాలను పునరావృతం చేయిస్తూ విద్యార్థులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని తనిఖీ చేశారు. మెనూలో ఉన్న కొన్ని పదార్థాలు లేకపోవడంపై కారణాలు అడిగి తెలుసుకుని, వడ్డించిన ఆహారాన్ని తిని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. వంటల్లో ఉప్పు అధికంగా ఉన్నట్లు గమనించి, సరిపడ మోతాదులో మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలంటే మెనూ ప్రకారం అన్ని పదార్థాలు తప్పనిసరిగా వండాలని స్పష్టం చేశారు.

స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఎండాకాలంలో కూరగాయలు త్వరగా పాడయ్యే అవకాశం ఉన్నందున తాజా, నాణ్యమైన కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. మెనూలో ఉన్న బీట్‌రూట్, పాలకూర అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు గురించి విచారించి, ఆర్ ఓ ప్లాంట్ నుంచి వచ్చే వేస్ట్ వాటర్‌ను శుభ్రత పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ట్యాపుల లీకేజీ గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు మరియు ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ముఖ్య కేంద్రాలని తెలిపారు . విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, పరిశుభ్ర వాతావరణం కల్పించడం అత్యవసరమని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు క్రమబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయులు వారికి సమగ్ర మార్గదర్శనం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సమయానుకూలంగా వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని, టీకాలు మరియు అత్యవసర మందులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను వేగంగా ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని, రిఫరల్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ యూనిఫాం నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని, లోపాలు గుర్తించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మెడికల్ అధికారి ప్రియాంక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల అభ్యాసనపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పెద్దమడ్డూర్ జెడ్పీహెచ్ఎస్
- పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**జనగామ, మార్చి 24 (వుదయం జిల్లా ప్రతినిధి) :** విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపరచడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం దేవరుప్పుల మండలం పెద్దమడ్డూర్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, మధ్యాహ్న భోజన నాణ్యత బోధనా పద్ధతులను కలెక్టర్ కూలంకషంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సమయపాలన ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఒక్కరూ విధిగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. సరుకుల నిల్వ అకౌంట్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రికార్డుల నిర్వహణలో ఏమరపాటు తగదని సూచించారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు.

వంట గదిని పరిశీలించి, వంట చేసేటప్పుడు పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ప్రతిరోజూ నిర్ణీత మెనూ ప్రకారం పోషకాలతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు.

ఇంటర్వెల్ సమయంలో విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, వారికి అందిస్తున్న 'రాగి జావ' రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగుందని సమాధానం ఇవ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.బోధనా పద్ధతుల పరిశీలన తరగతి గదులను సందర్శించిన కలెక్టర్, ఉపాధ్యాయుల బోధనా విధానాలను గమనించారు. విద్యార్థుల అభ్యాసన స్థాయిని మెరుగుపరిచేందుకు వినూత్న పద్ధతులను అవలంబించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో టెక్నికల్ అసిస్టెంట్లదే కీలక పాత్ర



- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**హనుమకొండ, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణన ప్రక్రియలో టెక్నికల్ అసిస్టెంట్ల పాత్ర అత్యంత కీలకమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ ఎంజీఎం సర్కిల్‌లోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో సెన్సస్ ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 11వ తేదీ నుండి జనగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. శిక్షణ పొందిన వారికి తుది పరీక్ష నిర్వహించి, అందులో ప్రతిభ కనబరిచిన వారిని మండలాల వారీగా కేటాయిస్తాం.

సి.ఎం.ఎస్.ఎస్ (CMSS) పోర్టల్‌లో వివరాల నమోదు, డేటా అప్‌డేషన్ వంటి అంశాలపై అసిస్టెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలి. శిక్షణలో అందించే మెటీరియల్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ఎటువంటి తప్పులు దొర్లకుండా జనగణనను విజయవంతం చేయాలి.ఈ కార్యక్రమంలో జనగణన జాయింట్ డైరెక్టర్ సుబ్బరాజు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఎస్.ఓ రాం దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సంక్షేమ నిధులు

## ప్రతి పైసా లక్ష్యం దిశగా సాగాలి: కలెక్టర్

**ఖమ్మం,మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** ప్రణాళిక ప్రకారం ఎస్సీ అభివృద్ధి నిధులు పూర్తి స్థాయిలో వినియోగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, వివిధ శాఖలలో ఎస్సీ అభివృద్ధి ఫండ్ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, మహిళా శిశు సంక్షేమ శాఖ, రోడ్లు భవనాల శాఖ, ప్లానింగ్, మిషన్ భగీరథ, ఎస్సీడీసీఎల్, ఎస్సీ అభివృద్ధి శాఖ, మొదలగు వివిధ శాఖల పరిధిలో ఎస్సీ అభివృద్ధి ఫండ్ నిధుల వినియోగంపై చర్చించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.





ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎస్సీ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి శాఖ పరిధిలో షెడ్యూల్ కులాల లబ్ధిదారు లకు ప్రాధాన్యత ఇవ్వడం కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.

వ్యవసాయ శాఖ పరిధిలో సాగు ఆధునీకరణ, ఇతర అభివృద్ధి పథకాలు ఎస్సీ రైతులకు అమలు చేయడంలో కొంత వెనుకబడి ఉన్నామని, రాబోయే సంవత్సరంలో మరింత మెరుగ్గా ప్రణాళిక సిద్ధం చేసుకుని వచ్చిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

హార్టికల్చర్ విభాగంలో ఆయిల్ పామ్, మైక్రో ఇరిగేషన్ పథకాలలో ఎస్సీలకు కేటాయించిన లబ్ధిదారులు 20 శాతం కూడా చేరుకోకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఆరోగ్య లక్ష్మీ స్కీంను మరింత మెరుగ్గా అమలు చేసి పూర్తి స్థాయిలో నిధులు వినియోగించాలని అన్నారు.

ప్రతి శాఖకు విడుదల చేసే నిధులలో ఎస్సి లకు, ఎస్టీలకు తప్పనిసరిగా ఖర్చు చేయాలని అన్నారు. ఎస్సి అభివృద్ధి నిధుల వినియోగంపై రిపోర్ట్ పకడ్బందీగా తయారు చేసి పంపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, ఈడీ ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, సిపిఓ ఏ. శ్రీనివాస్, డిడబ్ల్యూఓ వేల్పుల విజేత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిఆర్డీవో కె. శ్రీరామ్, పిడి హౌసింగ్ బి. శ్రీనివాస్, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, పోలీస్, విద్యుత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి




- శిశువైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు,మార్చి 24 (వుదయం జిల్లా ప్రతినిధి):** జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించి, వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు వైద్య సిబ్బంది కృత నిశ్చయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. మంగళవారం రోజున ఆయన గోవింద రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య శిబిరాన్ని, అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు.జిల్లా ప్రజలు, ముఖ్యంగా గర్భిణీలు, కిషోర బాలికలు, వృద్ధులు స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. గోవింద రావుపేట పీహెచ్‌సీలో ల్యాబ్, మందుల గదిని పరిశీలించి, ఓపీ సంఖ్యను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. రోగుల కోరిక మేరకు ఆయుష్ సేవలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విక్రమ్ డాక్టర్ అనూష పి హెచ్ ఎన్ లక్ష్మి శ్యామల జంపయ్య నీరజ శివాని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. శిశువైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి జిల్లా ఆసుపత్రిలో నవజాత శిశువులకు స్థానికంగానే మెరుగైన చికిత్స అందాలని, ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం లేకుండా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

ఇందుకోసం సిబ్బందికి అదనపు శిక్షణ ఇప్పించాలని అధికారులను కోరారు. ఆసుపత్రిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమాల్లో డాక్టర్ చంద్రశేఖర్ (జి.జి.హెచ్ సూపరింటెండెంట్), డాక్టర్ జగదీశ్వర్ (డి.సి.హెచ్.ఎస్), డాక్టర్ విక్రమ్, డాక్టర్ అనూష, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్షయ రహిత జిల్లాగామారుద్దాం

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపు




**సూర్యాపేట మార్చి 24(వుదయం)** క్షయ (టీబీ)ను జిల్లా నుంచి పూర్తిగా నిర్మూలించి టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్ములన దినోత్సవం సందర్భంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో క్షయ వ్యాధి నిర్ములన పై గాంధీ పార్క్ నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జెండా ఊపి ప్రారంభించారు

.. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ, సామాజిక వ్యాప్తి జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి నిర్ధారణ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్నీ పరికరాలు, పూర్తి స్థాయి చికిత్స తగిన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రూ.20 లక్షల వ్యయంతో మొబైల్ ఎక్స్ రే మిషన్ కొనుగోలు చేసి వాటి ద్వారా జనవరి 2025నుండి జిల్లా వ్యాప్తంగా 52,901 మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగిందని వీరిలో 1741 మందికి రోగ నిర్ధారణ కాగా 1356 మందికి చికిత్స పూర్తి అయిందని ప్రస్తుతం 385మందికి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. 21 గ్రామ పంచాయితీలను టీబీ ముక్తి గ్రామ పంచాయితీలుగా గుర్తించడం జరిగిందని జిల్లాలో కొత్త కేసులు నమోదవకుండా 21 నుండి 100 టిబి ముక్తి జిపిలుగా, టిబి ముక్తి మండలాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు టిబి వారియర్ లుగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో అవగాహన, అనుమానితులకు పరీక్షలు నిర్వహించి లక్ష్య సాధన చేరిన పిహెచ్సీలకు రూ.లక్ష ప్రోత్సాహకాన్ని, జిల్లాలోని మూడు టీబీ యూనిట్ల అభివృద్ధి కొరకై రూ.3లక్షల చొప్పున కలెక్టర్ ప్రకటించారు. అనంతరం టిబి ముక్తి జీపీలుగా తీర్చిదిద్దిన సర్పంచులను, గ్రామ కార్యదర్శులను, వైద్య సిబ్బందిని ప్రశంసా పత్రాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, ప్రస్తుత ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్, డాక్టర్ నాజియా తబస్సుమ్, హెచ్వోడిలు డాక్టర్ గురు రాజు, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ శ్రీకాంత్ భట్, డాక్టర్ జనార్ధన్, పల్మనాలజిస్ట్ డాక్టర్ వెంకట పాపిరెడ్డి, డిప్యూటీ డియంహెచ్ఓలు డాక్టర్ జి చంద్రశేఖర్, డాక్టర్ మాధవ్ కుమార్, ఆర్డిఓ వేణు మాధవ్, వైద్యాధికారులు, ఇతర వైద్య సిబ్బంది. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం




- క్షయ నిర్మూలనలో 'మహబూబాబాద్' మేటి

**మహబూబాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి):** క్షయ వ్యాధి (టీబీ) నియంత్రణలో మహబూబాబాద్ జిల్లా విశేష ప్రతిభ కనబరిచింది. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం రోజున హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చేతుల మీదుగా ఆయన ఈ "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు"ను స్వీకరించారు.సమిష్టి కృషికి దక్కిన గుర్తింపు పురస్కారం అందుకున్న అనంతరం డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. జిల్లాలో టీబీ కేసులను ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో నాణ్యమైన చికిత్స అందించడం, . రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత పరీక్షలు చేయించుకోవాలి.

టీబీ అనేది ప్రాణాంతక వ్యాధి కాదు, టీబీ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులు, పౌష్టికాహార సహాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు ప్రజలందరూ అపోహలను వీడి ఆరోగ్య కార్యకర్తలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శ్రీరామనవమి ఏర్పాట్లకు వినతిపత్రం

**నల్గొండ, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** రాబోయే మార్చి 27న జరగనున్న శ్రీ రామనవమి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారికంగా నిధులు కేటాయించాలని కోరుతూ నల్గొండ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్రకు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణ, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, పాటు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. . జిల్లా ఉపాధ్యక్షులు ఫకీరు మోహన్ రెడ్డి, కార్యాలయ సహాయ కార్యదర్శి మంగిలిపల్లి కిషన్, కార్పొరేటర్లు దాసరి సాయి, వంగూరి నవ్యశ్రీ రాఖీ, సటు రేవతి బలరాం, రామగిరి అఖిల్, యాదగిరి చారి, విజయేందర్ రెడ్డి, చింత శివరామకృష్ణ, యానాల కరుణాకర్ రెడ్డి, ఆకునూరి సత్యనారాయణ, ఉంగరాల కళ్యాణ్ చక్రవర్తి, పబ్బు నరేందర్, నారుగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## వర్షాధారిత పథకంతో రైతులకు ఆధునిక సాయం

- నల్లవెల్లిలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య క్షేత్ర పర్యటన
- రైతులకు అందిస్తున్న ఆధునిక పరికరాలు, రాయితీల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో సమీక్ష







సంగారెడ్డిజిల్లా ప్రతి నిధి, మార్చి 24:-వుదయం

వర్షాధారిత పథకంతో రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు, ఆదాయం సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. గుమ్మడిదల మండలం నల్లవెల్లి గ్రామంలో అమలవుతున్న వర్షాధారిత అభివృద్ధి పథకాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మంగళవారం పరిశీలించి, రైతులకు అందిస్తున్న ఆధునిక పరికరాలు, రాయితీల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా రైతు కూర్మ కొమురయ్య కూరగాయల పొలాన్ని పరిశీలించి, పథకం కింద అందించిన వ్యవసాయ పరికరాల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ పథకం ద్వారా రైతులు పొందుతున్న లాభాలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. వర్షాధారిత అభివృద్ధి పథకం కింద మొత్తం 115 మంది లబ్ధిదారులకు సుమారు రూ.32.10 లక్షల విలువైన రాయితీలు మరియు వ్యవసాయ పరికరాలు అందజేసినట్లు తెలిపారు. ఇందులో ప్లాస్టిక్ క్రేట్లు, వర్మీ బెడ్స్, తేనెటీగల పెంపక బాక్సులు వంటి పరికరాలు ఉన్నాయని తెలిపారు. రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ అధిక లాభాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకొని, సమిష్టిగా పంటల విక్రయం చేయడంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సమీకృతంగా వినియోగించుకుంటే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వర రావు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఉషారాణి, మండల రెవెన్యూ అధికారి పరమేశ్వర్, ఉద్యాన అధికారులు మౌనిక, అనూష, వ్యవసాయ అధికారి, హెచ్ఈఓలు విట్టల్, స్వామి, ఏఈ హౌసింగ్, సర్పంచ్ రాణి సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### గుమ్మడిదలలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం గుమ్మడిదల మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియను పరిశీలించడంతో పాటు నల్లవల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాన్ని సందర్శించి లబ్ధిదారుతో మాట్లాడారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముందుగా గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలు, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించి అక్కడి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. రోగుల ఆరోగ్య చరిత్రను డిజిటల్ రూపంలో భద్రపరచడం ద్వారా వైద్య సేవలు మరింత సమర్థవంతంగా, వేగవంతంగా అందించవచ్చని తెలిపారు. నెట్‌వర్క్, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా, ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీసి, అవసరమైన అన్ని ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదనంతరం నల్లవల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాన్ని సందర్శించిన కలెక్టర్, లబ్ధిదారుతో మాట్లాడి ఇంటి నిర్మాణ నాణ్యత, అందుబాటులో ఉన్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగాయా అని ఆరా తీసి, ఇల్లు చక్కగా నిర్మించు కున్నందుకు లబ్ధిదారును అభినందించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవిత ప్రమాణాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. పిమ్మట గుమ్మడిదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి, సిఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై తహసిల్దార్‌తో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖ ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో తహసిల్దార్ పరమేశ్వర్, నల్లవల్లి సర్పంచ్ రాణి సురేష్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం




### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి మార్చ్ 24(వుదయం ప్రతినిధి)** క్షయ వ్యాధికి మందులు ఉన్నాయని, ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధి పూర్తిగా నయమైపోతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక టి.బి. నివారణ కేంద్రంలో కలెక్టర్ వంద రోజుల క్యాంపెయిన్ వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ వంద రోజుల కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామ గ్రామాలకు తిరుగుతూ టి.బి. లక్షణాలు ఉన్న వ్యక్తులకు ఉచితంగా మొబైల్ ఎక్సరే, తేమడ పరీక్షలు నిర్వహించి టి.బి. ఉన్న రోగులకు ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుంది. క్షయ వ్యాధి రోగులను గుర్తించే కార్యక్రమం ఇప్పటికే జిల్లాలో నిర్వహించి క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు ఉచితంగా మందులు పౌష్టికాహారం వెయ్యి రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగ కలెక్టర్ చేతుల మీదుగా క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కోట్లలో గోధుమ పిండి, మంచి నూనె, బెల్లం, వేరుశనగ, పప్పు దినుసులు వంటి ఆహార పదార్థాలు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టి బి అనేది ఒక అంటూ వ్యాధి అని దీనిని ఆదిలోనే గుర్తించి ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఇచ్చే మందులను (6) నెలలపాటు క్రమం తప్పకుండా వాడితే జీవితంలో మరెప్పుడూ టీబి రాకుండా నయం అయిపోతుందన్నారు. ఒక నెల, రెండు నెలలు వాడి ఇక నయం అయిపోతుందని మందులు వేసుకోవడం మానేస్తే కొద్ది రోజులకే తిరిగి వ్యాధి వస్తుందని చెప్పారు. అందుకే వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండి ఆరు నెలలు మందులు వాడి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చు అని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి స్థానిక తహసిల్దార్ రమేష్ రెడ్డి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోతిరెడ్డి పల్లి పీహెచ్‌సీలో "100 డేస్ టీబీ ముక్త్ భారత్" కార్యక్రమం



### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి. ( వుదయం)** సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ టీబీ డే సందర్భంగా "100 డేస్ టిబి ముక్త్ భారత్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టీ బి ముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. టిబి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకు పూర్తి చికిత్స తీసుకుంటే వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారా టిబి నివారణ సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు మరియు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. వారు టిబి నివారణపై నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రజలకు వ్యాధి లక్షణాలు, చికిత్స విధానం, ప్రభుత్వ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో టిబి వ్యాధిపై అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం కల్పించడం ముఖ్య లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.

## క్షయ రహిత సమాజం కోసం సమష్టిగా కృషి చేద్దాం





### అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

**వికారాబాద్ జిల్లా: వుదయం ప్రతినిధి;** క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరీ జిల్లా ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ,జిల్లా కేంద్రం లోని ఐడీఓసీ కాంప్లెక్స్ నందు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, నిర్వహించిన టీబీ అవగాహన ర్యాలీకి వారు ముఖ్య అతిథులుగా హాజరై ర్యాలిని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశం లో ప్రాణాంతక వ్యాధిలో క్షయ వ్యాధి ఒకటని వారు తెలుపుతూ వ్యాధి పై అవగాహన,వైద్యుల సూచనలతో ఈ ప్రాణాంతక వ్యాధిని సమూలంగా అరికట్టవచ్చని వారు తెలిపారు.అందుకోసం 2030 నాటికి టీబీ ముక్త్ భారత్ గా సమాజం లోని ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని అదనపు మరియు అసిస్టెంట్ కలెక్టర్ లు జిల్లా ప్రజలకు పిలుపు నిచ్చారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి మరియు జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, మహావీర్ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు, బృంగి పాఠశాల విద్యార్థులు టీబీ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. జ్వరము,తెమడ తో కూడిన దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే టీబీ లక్షణాలుగా గుర్తించి వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని అధికారులు తెలిపారు. వైద్య సిబ్బంది టీబీ నిర్ధారణ అయిన రోగులను నిరంతరం పర్యవేక్షిస్తూ పూర్తి చికిత్స తీసుకునే విధంగా చూడాలని వారు తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా టీబీ రోగి పూర్తి చికిత్స తీసుకునే విధంగా జాగ్రత్తపడాలని సూచించారు. చికిత్స కాలంలో రోగికి మంచి పోషకాహారం అందించాలని వైద్యాధికారులు తెలిపారు. పుట్టిన పిల్లలకు వెంటనే బీసీజి టీకా వేయించాలని అవగాహన కల్పించారు.అనంతరం టీబీ చికిత్స పొందుతున్న రోగులకు యజ్ఞ ఫౌండేషన్ వారి సహకారం తో పోషకాహార కిట్లను అడిషనల్ కలెక్టర్ అందజేశారు. మహావీర్ వైద్య కళాశాల డాక్టర్ సుబశ్రీ, వైద్య విద్యార్థులు మరియు బృంగి కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రప్రియ, విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణనలో పాల్గొనే అధికారులకు శిక్షణ కార్యక్రమం

### జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**గద్వాల మార్చి 24 (వుదయం ప్రతినిధి)** జన గణన 2027ను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అధికారులను అదేశించారు. మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 2027 జనాభా లెక్కల ప్రక్రియపై నిర్వహించిన తొలి రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన- 2027 నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని పక్కాగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జనాభా గణన-2027లో ఒక్కరినీ వదలకుండా, ఎలాంటి డూప్లికేషన్ లేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న జనాభా నిజమైన వివరాలతో ప్రతిబింబించాలని పేర్కొన్నారు. జన గణనలో పాల్గొనే అధికారులకు మూడు రోజుల పాటు శిక్షణ కొనసాగనుందన్నారు. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ, డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రతి వ్యక్తి, నివాస గృహాలు, కట్టడాలు, కుటుంబాల తదితర వివరాలను అధికారులు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. జన గణన ప్రక్రియ సజావుగా సాగితేనే ఆయా వర్గాల ప్రజలకు భవిష్యత్తులో సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం కార్యాచరణ రూపొందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. జన గణనలో పాల్గొని అధికారులు బాధ్యతాయుతంగా తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అధికారులకు పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సుల్తాన్ అలీ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనే మన లక్ష్యం



### జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్

**నాగర్ కర్నూల్ మార్చి 24(వుదయం ప్రతినిధి)** క్షయ వ్యాధిని 2030 సంవత్సరం వరకల్లా అంతం చేయాలని, క్షయ వ్యాధి నిర్మూలనే ప్రతి ఒక్కరి లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె రవికుమార్ తెలిపారు. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి రోజు సందర్భంగా ప్రధానమంత్రి టీబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 100 రోజుల క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షా శిబిరాల కార్యక్రమాన్ని డి ఎం హెచ్ ఓ డాక్టర్ రవి కుమార్ ప్రారంభించారు. తదనంతరం ప్రపంచ టి.బి. డే అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ డాక్టర్ కే. రవికుమార్ గారు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో 86 హైరిస్కు గ్రామాలలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్ష శిబిరాలను 24 వ తారీకు మార్చి నుండి 2 వ తారీకు జూలై 2026 నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్ష శిబిరంలో 14 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఎక్స్ రే నిర్వహిస్తారు. అనుమానిత క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ఎక్స్రే మరియు కళ్ళే పరీక్షలు నిర్వహిస్తారు. కార్యాచరణ ప్రణాళిక ప్రకారం హైరిస్క్ గ్రామాలలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాలు నిర్వహించినప్పుడు ,14 సంవత్సరాల పైబడిన వారందరినీ శిబిరానికి క్షేత్రస్థాయి సిబ్బంది తరలించాలని, గ్రామాలలో గల సర్పంచు మరియు ఇతర ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని తెలియజేశారు. ఈ శిబిరానికి వచ్చిన ప్రజలకు క్షయ వ్యాధి లక్షణాలు, చికిత్స ,నివారణ గురించి డి ఎం హెచ్ ఓ గారు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ భీమా నాయక్, వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సింధు, స్పెషలిస్ట్ వైద్య నిపుణులు, డిపిఎమ్ఓ ఆజాద్,హెల్త్ ఎడ్యుకేటర్ రాధ, హెల్త్ సూపర్వైజర్ మురళి, మనోజ్ కుమార్, ప్రమోద్, ఎం ఎల్ హెచ్ పి లు, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ గోవర్ధన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రజా సంక్షేమమే .. ప్రభుత్వ ధ్యేయం

### అభివృద్ధిలో ముందుకు : మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



**పాపన్నపేట, (వుదయం ప్రతినిధి) మార్చి :24** పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. మంగళవారం పొడ్చన్ పల్లి గ్రామంలో 48 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పాపన్నపేట లోని ఓ వేడుక మందిరంలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్,సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో మెదక్ నియోజకవర్గాన్ని ముందు ఉంచుతానని అన్నారు.,తహసీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీఓ విష్ణువర్ధన్,హౌసింగ్ పీడీ మాణిక్యం,డీఈ ప్రసన్న,ఏఈ అరుణ్ ప్రసాద్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్,పాపన్నపేట,పొడ్చన్ పల్లి, కుర్తివాడ సర్పంచులు పావని నరేందర్ గౌడ్,ఏసు,చెట్టుకింది శ్రీధర్,నాయకులు ప్రభాకర్ రెడ్డి,శెట్టి శ్రీకాంత్,ప్రశాంత్ రెడ్డి,గౌస్, గణేష్, ఖలీమ్,నాని,సూఫి,ప్రేమ్ రాథోడ్ ,సద్దామ్ హుస్సేన్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు సహకరించాలి




### జిల్లా కలెక్టర్ హేమావతి

**సిద్దిపేట, మార్చి 24 (వుదయం ప్రతినిధి)** జిల్లాలో ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తక్షణమే తమ క్షేత్రస్థాయి ప్రతినిధులను నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కే. హేమావతి సూచించారు. మంగళవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలోని చిన్న సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు కీలక అంశాలను వెల్లడించారు. ఓటరు నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయి అధికారులు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని, అందుకే త్వరగా నియామకాలు పూర్తి చేయాలని కోరారు. త్వరలో ప్రారంభం కానున్న నమోదు ప్రక్రియలో భాగంగా, ప్రభుత్వ అధికారులు మరియు పార్టీల ప్రతినిధులు కలిసి ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించాలని ఆదేశించారూ. 2002 మరియు 2025 ఓటర్ల జాబితాలను సరిపోల్చుకొని, అర్హులైన కొత్త ఓటర్ల చేర్పులు, మరణించిన లేదా ఊరు విడిచిన వారి పేర్ల తొలగింపులను వేగవంతం చేయాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు, నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి ప్రతినిధులకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా ఉండాలంటే రాజకీయ పార్టీల సహకారం అవసరం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మా లక్ష్యం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మోహన్ లాల్ (భారత రాష్ట్ర సమితి), భైరీ శంకర్ (బీజేపీ), అనిల్ కుమార్ (కాంగ్రెస్), మునీర్ (మజ్లిస్) మరియు జిల్లా ఎన్నికల విభాగపు పర్యవేక్షకులు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల పాలనను సమర్థవంతంగా కొనసాగించాలి

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ మార్చి 24(వుదయం ప్రతినిధి)** గ్రామ స్థాయి పాలనలో సర్పంచ్ పాత్రను బలోపేతం చేస్తేనే భవిష్యత్ లో శక్తి వంతమైన రాజకీయ నాయకత్వం ఏర్పడుతుందని ,గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్‌లు ముందుండి నాయకత్వం వహించాలని,గ్రామాల అభివృద్ధితో పాటు గ్రామ ప్రతిష్టను పెంచే విధంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా తమ వ్యక్తిగత గౌరవాన్ని కూడా పెంపొందించుకోవాలని నూతన సర్పంచ్‌లకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని 72 గ్రామాలకు చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు జిల్లా కేంద్రంలోని ఐడిఓసి ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన 4వ విడత శిక్షణా తరగతులను మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం దేశస్థాయిలో ప్రధానమంత్రి, రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి, జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ లకు ఏలాంటి బాధ్యతలు ఉంటాయో, ఆ విధమైన బాధ్యతగా వ్యవహరించేలా గ్రామస్థాయిలో సర్పంచులను నేరుగా ప్రజలే ఎన్నుకునే విధంగా రాజ్యాంగం ఈ అవకాశాలను కల్పించిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు సర్పంచులు ఎలాంటి రాజకీయ పార్టీలకు తావు ఇవ్వకుండా తమ పరిపాలనను ప్రతి పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడేలా ఉండాలని, నేడు సర్పంచుల స్థాయిలో వచ్చే గౌరవం మర్యాదలతో రానున్న వ్యక్తిగత రాజకీయం అభ్యున్నతికి దోహదపడతాయని, మహిళా సర్పంచుల స్థానాల్లో కుటుంబ సభ్యుల జోక్యం కల్పించకుండా మహిళా సర్పంచులు తమ నాయకత్వ పటిమలను పెంపొందించుకోవాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ లోటుపాట్లు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు.గ్రామ పాలనలో కుటుంబ సభ్యుల జోక్యానికి అవకాశం ఇవ్వకుండా, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని, గ్రామపంచాయతీలకు వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించి గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

### గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా

స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై పారదర్శకంగా పాలన సాగించాలని, గ్రామంలో నెలకొని ఉన్న పరిస్థితులపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకుంటే సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందని సూచించారు. పన్నులు, ఇతర స్థానిక వనరుల ద్వారా సమకూరే ఆదాయ వనరులపై దృష్టిని కేంద్రీకరించాలని, ఆదాయం సమకూరితే ప్రజోపయోగ పనులను చేపట్టి మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చుకోవచ్చని వినూత్న ఆలోచనలతో పలెల ప్రగతికి పాటుపడుతూ మంచి గుర్తింపు పొందాలని అదనపు కలెక్టర్ తెలిపారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత సర్పంచుల పై ఉందని గ్రామాల పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలను అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అదనపు కలెక్టర్ సూచించారు. 4 విడతలో కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాలకు చెందిన 72 మంది నూతన సర్పంచ్‌లకు ఐదు రోజులపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జీవి శ్యాంప్రసాద్ లాల్, అమరేందర్,డిపిఓ శ్రీరాములు, డి.ఎల్.పి.ఓలు, ఎంపీడీవోలు, నూతన సర్పంచులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


## కిమ్స్ ఆదాయం రూ.1,003 కోట్లు



కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో తొలిసారిగా రూ.1,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. సక్షా త్రైమాసిక ఆదాయం రూ.1,003 కోట్లుగా నమోదైంది. 2024–25 ఇదే కాల ఆదాయం రూ.790కోట్ల కంటే, ఇది 27% అధికం. ఇదే సమయం లో సంస్థ నికర లాభం మాత్రం రూ.93 కోట్ల నుంచి రూ.52 కోట్లకు పరిమితమైంది. కొత్తగా ప్రారంభించిన బెంగళూరు, థానే యూనిట్ల నిర్వహణ ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సంస్థ వివరించింది. చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని, ఒక్కో పడక ద్వారా వచ్చే సగటు ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 20.5% వృద్ధితో రూ.46,341కి చేరుకుందని పేర్కొంది.




# ఎస్‌బిఐ వినియోగదారులకు ఇక నుంచి ఛార్జీల మోతే!



దేశీయ బ్యాకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఖాతాదారులకు షాకిచ్చింది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా అందుబాటులో ఉన్న ఐఎంపీఎస్ (ఎఓఖ*) నగదు బదిలీ సేవలపై సర్వీస్ ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త నిబంధనలు 2026, ఫిబ్రవరి 15 నుంచి అమలులోకి రానున్నాయి. అయితే, సాధారణంగా అత్యవసర నగదు బదిలీల కోసం వినియోగించే ఎఓఖ* సేవలపై బ్యాంక్ పరిమితులను విధించింది. దీని ప్రకారం.. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ మరియు యోనో యాప్ ద్వారా చేసే లావాదేవీలకు ఈ ఛార్జీలు వర్తిస్తాయి. బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రూ. 25,000 వరకు ఎటువంటి ఛార్జీలు ఉండవు. రూ.25,001 నుంచి రూ.1,00,000 వరకు రూ.2 ప్లస్ జీఎస్‌టీ, రూ.1,00,001 నుంచి రూ. 2,00,000 వరకు రూ.6 ప్లస్ జీఎస్‌టీ, రూ.2,00,001 నుంచి రూ.5,00,000 వరకు రూ.10 ప్లస్ జీఎస్‌టీ చార్జ చయనున్నారు. కాగా, రూ.25 వేల లోపు చేసే లావాదేవీలపై ఎటువంటి ఛార్జీలు విధించకపోవడం సామాన్య వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించే అంశం. నేరుగా బ్యాంకు బ్రాంచ్‌కు వెళ్లి చేసే ఎఓఖ* ఛార్జీలలో ఎటువంటి మార్పు లేదు. అవి పాత పద్ధతిలోనే రూ.2 నుంచి రూ.20 వరకు కొనసాగుతాయి. అదేవిధంగా డిఫెన్స్, కేంద్ర ప్రభుత్వం, రైల్వే, పోలీసు సిబ్బందికి చెందిన శాలరీ అకౌంట్లకు, అలాగే కొన్ని ప్రత్యేక సేవింగ్స్ ఖాతాలకు మాత్రం ఈ ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుంది.

# ఏఐ వెల్‌నెస్ కోచ్‌లతో మారనున్న లైఫ్ స్టైల్



నేటి సమాజం పెరుగుతున్న టెక్నాలజీతో ఎంత వేగంగా మారుతుందో చెప్పడానికి మన చేతుల్లో ఉండే స్మార్ట్ పరికరాలో ప్రధాన ఉదాహరణ. ఒకప్పుడు కేవలం ఫోన్ కాల్స్, మెసేజ్‌లకే పరిమితమైన స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇప్పుడు మన ప్రాణాలను కాపాడే 'లైఫ్ గార్డ్స్'గా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఆరోగ్యంగా ఉండటానికి.. మనం ఏం తినాలి? ఎంతసేపు పడుకోవాలి? చివరికి మనం ఎప్పుడు నీళ్లు తాగాలో కూడా ఇప్పుడు ఒక 'చిప్', 'ఏఐ అల్గారిథం' నిర్ణయిస్తుంది. 2026లో లైఫ్ స్టైల్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న ''ఏఐ వెల్‌నెస్ కోచింగ్'' గురించి ఇక్కడ తెలుసుకుందాం. పాత కాలంలో మనకు ఆరోగ్యం బాలేకపోతే డాక్టరు దగ్గరికో, ఫిట్‌నెస్ కోసం యోగా గురువు, ట్రైనర్ దగ్గరికో వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండానే మన చేతికి ఉన్న స్మార్ట్ రింగ్, స్మార్ట్ వాచ్ మన శరీరంలోని ప్రతి కదలికలను గమనిస్తోంది. ఇవి కేవలం అడుగులను లెక్కించడమే కాకుండా, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను, గుండె వేగంలోని హెచ్చుతగ్గులను, నిద్ర నాణ్యతను సెకన్ల వ్యవధిలో విశ్లేషిస్తున్నాయి. ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి, మన శరీర తత్వానికి తగ్గట్టుగా పర్సనలైజ్డ్ సూచనలను అందిస్తున్నాయి. అభివృద్ధి తో పోటీ పడుతున్న ఈ సమయంలో మనం తీసుకునే ఆహారం, మనపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి శరీర మెటబాలిజం ఒకేలా ఉండదు. అందుకే అందరికీ ఒకే రకమైన డైట్ ప్లాన్ పని చేయదు. ఏఐ కోచ్‌లు శరీరంలోని షుగర్ లెవల్స్, క్యాలరీ బర్నింగ్ రేటును బట్టి, కు ఆ రోజూ ఏ ఆహారం అవసరమో సూచిస్తాయి. ఉదాహరణకు, రు వ్యాయామం చేసిన తర్వాత ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోమని, రక్తంలో షుగర్ పెరిగితే కార్బోహైడ్రేట్లు తగ్గించమని ఇవి మనకు సలహాలు అందిస్తాయి. పోటీ ప్రపంచంలో పని ఒత్తిడి, ఆర్థిక, కుటుంబ కారణాల వల్ల ఎంతో మంది మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది నేటి తరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య గా మిగిలిపోయింది. రు ఎప్పుడు ఆందోళనకు గురవుతున్నారో నాడి వేగాన్ని బట్టి ఏఐ గుర్తిస్తుంది. వెంటనే ఫోన్‌లో ఒక చిన్న మెడిటేషన్ సెషన్, ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే ఎక్సర్‌సైజ్ చేయమని రిమైండర్లు పంపుతుంది. తద్వారా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి కాకముందే మిమ్మల్ని అలర్ట్ ఇది చేస్తుంది.

# భారత ఎగుమతిదారులు, ఎంఎస్‌ఎంఇ రంగానికి సువర్ణావకాశం




భారత్ అమెరికా దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందానికి సంబంధించిన అధికారిక ముసాయిదా విడుదలైంది. దీంతో ఇరు దేశాల నేతలు ఈ చారిత్రక ఒప్పందం పై హర్షం వ్యక్తం చేస్తూ సోషల్ డియా వేదికగా ప్రకటనలు విడుదల చేస్తున్నారు. అయితే ఈ ఒప్పందం వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే క్లారిటీ ఇప్పుడిప్పుడే వస్తుంది. భారత్, అమెరికాల ఒప్పందం కారణంగా.. భారతీయ ఎగుమతిదారులకు సుమారు 30 ట్రిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్ అందుబాటులోకి రానున్నట్లు మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇందులో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవస్థాపకులు మరియు స్టార్టప్ ఆవిష్కర్తలు తమ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయడానికి భారీ అవకాశాలు లభిస్తాయి. అమెరికా తన దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గించడం వల్ల టెక్స్‌టైల్స్, లెదర్, ఫుట్‌వేర్, ప్లాస్టిక్, హ్యాండీక్రాఫ్ట్స్ వంటి రంగాలకు చెందిన తయారీదారులు అంతర్జాతీయ విపణిలో గొప్ప లాభాలను పొందే అవకాశం ఉంది. తాజా పరిణామాలతో ఎవరికి లాభం ఎవరికి నష్టం అనే విషయాలను ఇక్కడ చూద్దాం. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కేవలం ఆర్థిక వృద్ధికే పరిమితం కాకుండా, దేశంలో లక్షలాది కొత్త ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమం చేస్తుంది. ఎగుమతులు పెరగడం వల్ల తయారీ, సేవా రంగాల్లో నూతన అవకాశాలు లభిస్తాయి, ఇవి ప్రధానంగా యువత, మహిళా కార్మికులకు ఎంతో మేలు చేస్తాయి. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెరిగి, మధ్యతరగతి, గ్రాణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని అంచనా వేయబడింది. ఈ ఒప్పందం కారణంగా భారత్ రైతులు, వ్యవసాయ రంగానికి నష్టం కలిగే అవకాశం ఉందని మొదట అనే విమర్శలు వచ్చాయి. అయితే దేశీయ వ్యవసాయ రంగంపై ప్రభావం చూపకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. భారత్ తన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, సున్నితమైన వ్యవసాయ, పాడి ఉత్పత్తులైన వరి, గోధుమ, మొక్కజొన్న, పాలు, చీజ్, పౌల్ట్రీ వంటి వాటిని ఈ ఒప్పందం పరిధిలోకి రాకుండా పూర్తి రక్షణ కల్పించింది. దీనివల్ల అమెరికా నుంచి వచ్చే చౌకైన అగ్రి–ఉత్పత్తుల వల్ల మన రైతులు నష్టపోయే ప్రమాదం లేకుండా ప్రభుత్వం జాగ్రత్త పడింది. ఈ ఒప్పందం కారణంగా అమెరికా నుంచి అనే వస్తువులు భారత్‌లోకి దిగుమతి అవుతాయి. దీంతో భారతీయ కంపెనీలు అమెరికా నుంచి వచ్చే నాణ్యమైన ఉత్పత్తులతో పోటీ పడాల్సి ఉంటుంది. అమెరికా కూడా పరస్పర ప్రాతిపదికన కొన్ని రాయితీలను పొందుతుంది కాబట్టి, మన దేశీయ మార్కెట్లోకి వచ్చే అమెరికా వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. ఇది భారతీయ వినియోగదారులకు లాభం చేకూర్చినప్పటికీ, దేశీయ తయారీదారులు తమ నాణ్యతను పెంచుకుని పోటీని పెట్టుకోవాల్సిన సవాలును ఎదుర్కొంటారు. ముఖ్యంగా విమాన విడిభాగాలు, జెనరిక్ ఫార్మా రంగాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగు పడాల్సి ఉంటుంది.

## పిఎఫ్‌సి చేతికి ఆర్‌ఇసి..




దేశీయ విద్యుత్ రంగ ఫైనాన్సింగ్ రంగంలో భారీ విలీనం చోటు చేసుకుంది. ప్రభుత్వ రంగ దిగ్గజం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఇసి)లో ప్రభుత్వానికి ఉన్న 52.63 శాతం వాటాను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఆర్‌ఎఫ్‌సి) కొనుగోలు చేసింది. దీనితో ఆర్‌ఇసి ఇప్పుడు పిఎఫ్‌సికి అనుబంధ సంస్థగా మారింది. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ కొనుగోలుకు ఆమోదం తెలపడమే కాకుండా, భవిష్యత్తులో ఈ రెండు సంస్థల పూర్తిస్థాయి విలీనానికి కూడా సూత్రప్రాయంగా అంగీకారం లభించింది. రెండు సంస్థల విలీనం ద్వారా రుణ పంపిణీసామర్థ్యం పెరిగి, గ్రీన్ హైడ్రోజన్, ఇవి బ్యాటరీ స్టోరేజ్, మెట్రో రైలు వంటి భారీ ప్రాజెక్టులకు ఆర్థిక సహా యం మరింత సులభతరం కానుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయంతో కేంద్రానికి భారీ ఆదాయం సమకూరనుంది. ఇది ఒక రకంగా పెట్టుబడుల ఉపసంహరణే కావడం గమనార్హం.

# ఆన్‌లైన్ మోసాల బాధితులకు రూ.25,000 పరిహారం



ఈసారి ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో ఆర్‌బీఐ కీలక ప్రతిపాదన చేసింది. చిన్న మొత్తంలో జరిగే మోసపూరిత లావాదేవీలలో నష్టపోయిన వినియోగదారులకు రూ. 25,000 వరకు పరిహారం అందించడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదిస్తుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం తెలిపారు. వినియోగదారుల రక్షణ, డిజిటల్ చెల్లింపుల భద్రతను పెంచడానికి ఆర్‌బీఐ తీసుకున్న అనేక చర్యల్లో ఇది భాగం. దీనికి సంబంధించి మార్గదర్శకాలను త్వరలో జారీ చేస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ పరిహార ప్రయోజనం జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వస్తుందని, ప్రతి సంవత్సరం కాదు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండటానికి, పదే పదే తప్పులు చేయకుండా నిలువరించడానికే ఈ పరిమితిని నిర్ణయించారు. చెల్లించాల్సిన మొత్తం నష్టంలో 85 శాతం లేదా రూ. 25,000, ఈ రెండింటి లో ఏది తక్కువ అయితే అదిగా లెక్కిస్తా రు. ఉదాహరణకు నష్టం రూ.50,000 అయితే, 85% అంటే రూ.42,500 అవుతుంది. కానీ ఆర్‌బీఐ రూ.25,000 మాత్రమే చెల్లిస్తుంది. అదే, నష్టం రూ.20,000 అయితే, 85 శాతం అంటే రూ. 17,000, కాబట్టి పరిహారం రూ.17,000 ఇస్తారు. ఆర్‌బీఐ డేటా ప్రకారం, 2023–24 ఆర్థిక సంవత్సరంలో 29,080 మోసాలు, రూ. 1,457 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఆ తర్వాత 2024–25 ఆర్థిక సంవత్సరంలో కార్డ్, ఇంటర్నెట్ ఆధారిత లావాదేవీలకు సంబంధించిన 13,469 మోసాల కేసులు నమోదయ్యాయని, వీటి వల్ల రూ.520 కోట్ల నష్టం వాటిల్లిందని బ్యాంకులు నివేదించాయి. అలాగే, బ్యాంకులు కస్టమర్లకు అవసరంలేని, పూర్తి సమాచారం ఇవ్వకుండా రుణాలివ్వడం, రుణాల రికవరీ, అప్పులను వసూలు చేయడానికి ఏజెంట్ల వినియోగంపై మార్గదర్శకాలను జారీ చేస్తామని ఆర్‌బీఐ పేర్కొంది.





## స్టార్క్ రాకపై అనిశ్చితి



ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ ఐపీఎల్‌లో ఆడడంపై అనిశ్చితి కొనసాగుతోంది. ఐపీఎల్‌లో పాల్గొనేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) నుంచి అతనికి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) అందకపోవడమే కారణం. అయితే ఏప్రిల్ 1న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో ఢిల్లీ తొలి మ్యాచ్ కంటే ముందే స్టార్క్ జట్టులోకి వస్తాడని ఫ్రాంచైజీ ధీమాతో ఉంది. "సీఏ నుంచి ఎన్‌ఓసీ కోసం ఎదురుచూస్తున్నాం. ఎన్‌ఓసీ అందిన వెంటనే స్టార్క్ ఎప్పుడు జట్టుతో చేరతాడో తెలుస్తుంది. ఈ విషయంపై సీఏతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. స్టార్క్ ఇప్పటికే బౌలింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. అతను ఆడటానికి పూర్తి ఫిట్‌గా ఉన్నట్లు సీఏ ధ్రువీకరించే వరకు ఫ్రాంచైజీ ఏ చేయలేదు'' అని ఢిల్లీ చీఫ్ కోచ్ హేమంగ్ బదాని తెలిపాడు. స్టార్క్ రాక ఖాయమని.. ప్రస్తుతం అతని ఫిట్‌నెస్, పనిభారాన్ని సీఏ పర్యవేక్షిస్తోందని ఢిల్లీ డైరెక్టర్ వేణుగోపాలరావు పేర్కొన్నాడు.

# సన్ రైజర్స్ కు బిగ్ రిలీఫ్.. ఆ డేంజర్ ప్లేయర్ వచ్చేస్తున్నాడు



ఐపీఎల్ 2026 ప్రారంభానికి కేవలం నాలుగు రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో బౌలర్ల కోసం టెన్షన్ పడుతున్న హైదరాబాద్ జట్టుకు బిగ్ రిలీఫ్ దక్కింది. సంబంధించిన స్టార్ బౌలర్ ఎషాన్ మలింగ ఐపీఎల్ 2026లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఈ మేరకు శ్రీలంక క్రికెట్ బోర్డు క్లియరెన్స్ సర్టిఫికెట్ కూడా ఇచ్చింది. ఇటీవల కాలంలో ఎషాన్ మలింగకు గాయమైంది. ఈ తరుణంలో అతడు ఆడటం కష్టమే అన్నారు. కానీ లేటెస్ట్‌గా శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి ఫిట్ నెస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ తెచ్చుకున్న ఎషాన్ మలింగ, సన్ రైజర్స్ హైదరాబాద్ శిబిరంలో చేరబోతున్నాడు. దీంతో హైదరాబాద్ కు భారీ ఊరట లభించనుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ ఆడే మొదటి దశ మ్యాచ్ లకు కెప్టెన్ కమిన్స్ దూరమవుతున్న సంగతి తెలిసిందే. అతడు మళ్లీ ఎప్పుడు వస్తాడనే దానిపై క్లారిటీ లేదు. ఈ నేపథ్యంలోనే ఇషాన్ కిషన్ కు కెప్టెన్సీ ఇచ్చారు కావ్య మారన్. కాగా ఐపీఎల్ 2026లో బెంగళూరుతో తన తొలి మ్యాచ్ ఆడనుంది సన్ రైజర్స్. అయితే ఈ మ్యాచ్ నేపథ్యంలో బ్యాటింగ్ పరంగా బలంగా ఉన్న హైదరాబాద్, బౌలింగ్ తో కాస్త వీక్ గా కనిపిస్తోంది. లేటెస్ట్ గా ఎషాన్ మలింగ వస్తున్న నేపథ్యంలో కాస్త ఊరట లభించే ఛాన్స్ ఉంది.

# క్యాండిడేట్స్ టోర్నీకి హంపి దూరం



భారత చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిష్టాత్మకమైన ఫిడే మహిళల క్యాండిటేట్స్ టోర్నమెంట్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. యుద్ధం కారణంగా భద్రతపై ఆందోళనగా ఉందని, బాంబుల మోతల మధ్య చెస్ పై శ్రద్ధ పెట్టడం సాధ్యం కాదని వాపోయింది. ఇదివరకే టోర్నీ వేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన హంపి చివరకు టోర్నీని బాయ్ కాట్ చేస్తున్నట్లు సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'చాలా సమయం ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను. ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి । వైదొలుగుతున్నా. వ్యక్తిగత భద్రత, సురక్షితంగా ఉండడం కంటే ఏ ఈవెంట్ ముఖ్యమైనది కాదు. భరోసా నిర్వాహకులు కల్పించినప్పటికీ ప్రస్తుతం అక్కడి పరిస్థితుల్లో నేను సురక్షితంగా ఉంటానని అనిపించడం లేదు. ఈ నిర్ణయం బాధతో కూడినదే. కానీ, తప్పనిసరిగా తీసుకో వాల్సి వచ్చింది. నేను నా నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను' అని హంపి తన పోస్ట్లో వెల్లడించింది. దుబాయ్లో చిక్కుకొని ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ షిప్ పోటీలకు బ్యాడ్మింటన్ స్టార్ పివి సింధు దూరంగా ఉండగా.. కోనేరు హంపి సైతం మెగా ఈవెంట్ నుంచి వైదొలిగింది. మార్చి 28 నుంచి ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. హంపి వైదొలగడంతో ఆమె స్థానంలో ఉక్రెయిన్ అమ్మాయి అన్నా ముజిచుక్ క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికైంది. అయితే.. టోర్నీలో ఆడనందుకు హంపి పై భారీ జరిమానా పడింది. నిబంధనల ప్రకారం టోర్నీని బాయ్కట్ చేసినందుకు ఆమె భారత కరెన్సీలో రూ.1.50కోట్లు (10 వేల యూరో) జరిమానా పడే ఛాన్స్ ఉంది. హంపి వైదొలగడంతో ఈ టోర్నీకి ఎంపికైన ఇతర భారత యువకెరటాలు దివ్య దేశముఖ్, ఆర్. వైశాలి పాల్గొంటారా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

# బుమ్రాకు గాయం.. టెన్షన్ లో ముంబై ఇండియన్స్ !



ఐపీఎల్ 2026 కంటే ముందు ముంబై ఇండియన్స్ కు ఊహించని ఎదురు దెబ్బ తగిలేలా కనిపిస్తోంది. బౌలింగ్ పెద్దన్న బుమ్రా గాయం బారిన పడినట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కు బుమ్రా వెళ్లిన నేపథ్యంలో ముంబై ఇండియన్స్ అభిమానులు టెన్షన్ పడుతున్నారు. ఐపీఎల్ టోర్నమెంట్ ప్రారంభం కంటే ముందే ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కు బుమ్రా వెళ్ళిన నేపథ్యంలో అతనికి గాయమైందని ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే నిజంగానే బుమ్రాకు గాయమైనట్లు అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.కొంతమంది ప్లేయర్లు ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కు వెళ్లి రొటీన్ చెకప్ చేయించుకుంటారు. అందులో భాగంగానే బుమ్రా వెళ్లాడా ? లేక అతనికి నిజంగా ఏదైనా గాయం అయిందా ? అనే వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై ముంబై ఇండియన్స్ యాజమాన్యం స్పందిస్తే తప్ప అసలు నిజం బయటకు రాదని అంటున్నారు క్రీడా విశ్లేషకులు. ఒకవేళ బుమ్రా మాత్రం గాయం బారిన పడితే, ముంబైకి ఎదురుదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. కాగా ఆదివారం కేకేఆర్ తో ముంబై ఇండియన్స్ తొలి మ్యాచ్ ఉంది. ఈ టోర్నమెంట్ మార్చి 28వ తేదీన బెంగళూరు వర్సెస్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ తో ప్రారంభం కానుంది. ఎన్నికలు, యుద్ధం ఇలాంటివి ఎన్ని వచ్చినా తమ టోర్నమెంట్ షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుందని ఇప్పటికే బీసీసీఐ ప్రకటించింది.

# ఐపీఎల్ మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి




ఐపీఎల్ మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని లీగ్ వర్గాలు వెల్లడించాయి. ఆటగాళ్లకు గాయాలు, విదేశీ ఆటగాళ్లు అందుబాటులో ఉండటం వంటి అంశాలు ఆయా ఫ్రాంచైజీలు చూసుకుంటాయని తెలిపాయి. ఐపీఎల్ 2026 సీజన్ సమీపించింది. మార్చి 28 నుంచి మ్యాచ్ లు జరగనున్నాయి. ఇప్పటికీ పలువురు విదేశీ క్రికెటర్లు తమ జట్లతో చేరాల్సి ఉంది. మరికొందరు ఆటగాళ్లు గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ షెడ్యూల్‌పై పాలక వర్గాలు స్పష్టతనిచ్చాయి. ఐపీఎల్‌లో విదేశీ క్రికెటర్లు ఆడే విషయంలో ఫ్రాంచైజీలతో తుది నిర్ణయమని ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంలో పాలక వర్గం చేసేది ఏ ఉండదని తెలిపింది. కొందరు ఆటగాళ్లు గాయాల కారణంగా తమ జట్లతో కలవలేదని, ఇతర కారణాలతో మరికొందరు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండరని పేర్కొంది. ఈ అంశం ఫ్రాంచైజీలు చూసుకుంటాయని తెలిపింది. కానీ ఐపీఎల్ మాత్రం షెడ్యూల్ ప్రకారమే ఉంటుందని తెలిపింది. క్రికెట్ అభిమానుల కోసం అన్ని రకాల చర్యలు తీసుకున్నామని వెల్లడించింది.

# అల్కరాస్‌కు షాక్ వరల్డ్ నం.1పై సెబాస్టియన్ సంచలన విజయం

వరల్డ్ నం.1, ఇటీవలే కెరీర్ స్లామ్ సాధించిన యంగ్ బుల్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్)కు ఊహించని భంగపాటు. గత వారం ఇండియన్‌వెల్స్ సెమీఫైనల్లో డానిల్ మెద్వదేవ్ చేతిలో ఓడిన అల్కరాస్.. తాజాగా మియామి ఓపెన్‌లో రెండో రౌండ్ నుంచే నిష్క్రమించాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో అమెరికా యువ ఆటగాడు సెబాస్టియన్ కార్డా (25) మూడు సెట్ల పోరులో అల్కరాస్‌ను చిత్తుచేశాడు. 6–3, 5–7, 6–4తో రెండు గంటల 19 నిమిషాల్లోనే వరల్డ్ నం.1 కథ ముగించాడు సెబాస్టియన్. తొలి సెట్‌ను అలవోకగా నెగ్గిన సెబాస్టియన్.. రెండో సెట్లో 5–4తో మ్యాచ్ పాయింట్ ముంగిట నిలిచాడు. కానీ ఈదశలో వరుసగా ఐదు గేమ్‌లు గెలుపొందిన అల్కరాస్ మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లాడు. నిరుడు మియామి ఓపెన్‌లో వరల్డ్ నం.55 డెవిడ్ గొఫిన్ చేతిలో ఓడిన అల్క రాస్.. ఈ ఏడాది వరల్డ్ నం.36 సెబాస్టియన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో ఆరు గ్రాండ్‌స్లామ్ విజేత ఇగా స్వైటెక్ (పోలాండ్) సైతం తొలి రౌండ్లోనే పరాజయం పాలైన సంగతి తెలిసిందే. దీంతో మియామి ఓపెన్‌లో వరుసగా సంచలనాలు నమోదు అవుతున్నాయి. సెబాస్టియన్ 12 ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో మెరువగా.. అల్కరాస్ 2 ఏస్‌లు, 2 బ్రేక్ పాయింట్లతో సరిపెట్టాడు. పాయింట్ల పరంగా 101–97తో సెబాస్టియన్ పైచేయి సాధించాడు. మెన్స్ సింగిల్స్ రెండో రౌండ్లో అమెరికా ఆటగాడు టా పాల్ గట్టెక్కాడు. 6–2, 3–6, 7–6(7–5)తో రాఫేల్ కొలిగన్‌పై మూడు సెట్ల మ్యాచ్‌లో గెలుపొందాడు.



# వుదయం సినిమా

MOVIE TIME!

## దీవాన ఇది ప్రేమ సాంగ్ రిలీజ్

శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". స్నేహ మణిమేగలై హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతోంది. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. "దీవాన" సినిమా ఈ వేసవికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈరోజు ఈ చిత్రం నుంచి ఇది ప్రేమ సాంగ్ ను స్టార్ హీరోయిన్ సమంత చేతుల మీదుగా సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. అనంతరం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన సాంగ్ లాంఛ్ ఈవెంట్ లో ప్రముఖ దర్శకులు వెంకీ అట్లూరి, రవికిరణ్ కోలా, నందినీరెడ్డి అతిథులుగా పాల్గొన్నారు.




# గరివిడి లక్ష్మి

## కోసింది కొయగూర సాంగ్ రిలీజ్

భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. బుర్రకథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అద్భుతమైన జానపదం కోసింది కొయగూర సాంగ్ ని రిలీజ్ చేశారు మేకర్స్. చరణ్ అర్జున్ ఈ జానపదాన్ని రాఎనర్జీ వుండే డ్యాన్స్ నెంబర్ గా కంపోజ్ చేశారు. అనన్య భట్, షకలక శంకర్, గౌరీ నాయుడు జమ్ము వోకల్స్ మరింత వైబ్ ని యాడ్ చేశాయి.

ఉత్తరాంధ్ర జనపదం మూలం నుంచి స్వరపరిచిన ఈ పాటకు గంటేడ గౌరు నాయుడు, గౌరీ నాయుడు జమ్ము రాసిన అదనపు సాహిత్యం మరింత ఆకర్షణ తీసుకొచ్చింది.

ఈ సాంగ్ లో ఆనంది పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. రాగ్ మయూర్ ప్రజెన్స్ డ్యాన్స్ మూమెంట్స్ మరింత జోష్ ని తీసుకొచ్చింది.



# రాకాస థియేట్రికల్‌గా ఎక్స్ పీరియెన్స్ చిత్రం



జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్ అంతా కూడా అందరినీ ఆకట్టుకుంది. ఇక తాజాగా ఈ చిత్ర విశేషాల్ని పంచుకునేందుకు దర్శకురాలు మానస శర్మ మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే..

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

**మానస శర్మ:** మాది శ్రీకాకుళం. నేను మొదటగా యూట్యూబ్‌లో 'మ్యాడ్ హౌస్' చేశాను. ఆ తరువాత 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి క్రియేటర్, రైటర్‌గా పని చేశాను. ఆ తరువాత 'బెంచ్ లైఫ్' సిరీస్‌ని చేశాను. ఇది నాకు నాలుగో ప్రాజెక్ట్. ఫాంటసీ, అడ్వెంచర్‌లతో తీసిన 'రాకాస' చాలా కొత్తగా ఉండబోతుంది.

**'రాకాస'లో ప్రధాన అంశం ఏంటి?**

**మానస శర్మ :** 'రాకాస'ని ఫాంటసీ, అడ్వెంచర్, కామెడీ జానర్లో తీశాం. ఇప్పటికే అందరూ మా టీజర్‌ని చూసి ఉంటారు. త్వరలోనే ట్రైలర్ రానుంది. అప్పుడు మా సినిమా గురించి ఇంకా చాలా క్లియర్‌గా తెలుస్తుంది. కామెడీని ప్రధాన అంశంగా, కొద్దిగా హారర్ ఎలిమెంట్స్‌తో పూర్తి ఫాంటసీ, అడ్వెంచర్‌గా ఈ మూవీని తీశాం.

**సంగీత్ శోభన్ ఈ కథలోకి ఎలా వచ్చారు?**

**మానస శర్మ :** 'రాకాస' కథని ముందుగా నెట్ ఫ్లిక్స్‌లో సిరీస్ కోసం చెప్పాను. ఆ టైంలోనే ఈ కథను సంగీత్ విన్నారు. ఆయనకి కూడా కథ చాలా నచ్చింది. అలా ఈ ప్రాజెక్ట్‌లోకి సంగీత్ వచ్చారు. సంగీత్ అద్భుతమైన నటుడు. మంచి వ్యక్తి. అతని కామెడీ టైమింగ్ అంటే నాకు చాలా ఇష్టం.

**'రాకాస' చిత్రీకరణలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?**

**మానస శర్మ:** వెబ్ సిరీస్‌కి, సినిమాకి ఒకే రకమైన ఛాలెంజ్ ఉంటుంది. మేకింగ్ ఒకేలా ఉంటుంది.. రైటింగ్‌లోనే తేడా ఉంటుంది. షూటింగ్ పరంగా, చిత్రీకరణ సమయంలో ఎలాంటి తేడాలుండవు. ఈ సినిమా అవుట్ పుట్ నిహారికగారికి నచ్చాలని నేను మరింత బాధ్యతగా పని చేశాను. ఈ కథని పదిహేను నిమిషాలు నెరేట్ చేసిన తరువాత నిహారిక గారికి చాలా కాన్ఫిడెంట్ వచ్చేసి ఓకే చెప్పారు.

**నయన్ సారిక గురించి చెప్పండి?**

**మానస శర్మ :** నయన్ సారిక మంచి నటి. డైరెక్టర్ ఏం చెబితే అది చేస్తారు. ఆల్రెడీ నేను ఇది వరకే ఆమెతో పని చేసి ఉన్నాను. ఆమె టాలెంట్, యాక్టింగ్ చూసే ఈ చిత్రంలోకి తీసుకున్నాం. ఆమె పాత్రని ప్రేక్షకులంతా ఇష్టపడతారు.



# బ్యాండ్ మేళం

## సినిమా పెద్ద హిట్ అవ్వాలి

'కోర్ట్'తో బ్లాక్ బస్టర్ పెయిర్‌గా నిలిచిన హర్ష్ రోషన్, శ్రీదేవి జంట మళ్లీ 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 26న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ రైటర్ విజయేంద్ర ప్రసాద్, సెన్సేషనల్ డైరెక్టర్స్ వివి వినాయక్, బాబీ, నటుడు, నిర్మాత బండ్ల గణేష్, ఆస్కార్ గ్రహీత చంద్రబోస్, కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు, ప్రముఖ నిర్మాత సురేష్ బాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

## నిర్మాత బెల్లి జనార్ధన్ ఆకస్మిక మృతి !

ఇటీవల తూలికా తనిస్క్ క్రియేషన్స్ పతాకంపై 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రాన్ని నిర్మించడం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన 'బెల్లి జనార్ధన్' ఆకస్మిక మరణం పట్ల చిత్ర దర్శకుడు బాబ్జీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరిచారు.. నెల 22వ తేదీన ఉగాది పండుగ జరుపుకోవడం కోసం అత్తగారి ఊరైన 'కట్టంగూరు కు తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళిన బెల్లి జనార్ధన్ ఆ గ్రామంలో గల స్విమ్మింగ్ పూల్ లో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీటి అడుగుకు బలంగా తల తగిలి తీవ్రంగా గాయమవడంతో అక్కడికక్కడే ఊపిరి వదిలారని, 23 వ తేదీన వారి స్వగ్రామమైన నకిరేకల్ మండలంలోని 'పాలెం' గ్రామంలో మాజీ సైనికుడైన జనార్ధన్ గారికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 'పోలీస్ వారి హెచ్చరిక' సినిమా యూనిట్ తరుపున, వ్యక్తిగతంగా నా తరుపున నిర్మాత బెల్లి జనార్ధన్ గారి ఆకస్మిక మరణం పట్ల తీవ్రమైన దిగ్భ్రాంతిని వ్యక్తపరుస్తూ వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలుపుకుంటున్నామని దర్శకుడు బాబ్జీ తెలిపారు!



## అహా ఓటీటీలో దుమ్ము రేపుతున్న తురుమ్ ఖాన్‌లు

తెలంగాణ యాస, భాష నేపథ్యంలో విలేజ్ నేటివీటితో తెరకెక్కిన అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్ టైనర్ తురుమ్ ఖాన్ లు. ఈ సినిమా గురించి తెలిసిన ప్రేక్షకులు ఈ చిత్రం ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూశారు. ఎట్టకేలకు ఇటీవల ఆహా ఓటీటీ వేదికగా తురుమ్ ఖాన్ లు స్ట్రీమింగ్ అవుతుంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కామెడీ బిట్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కడుపుబ్బ నవ్వించే కామెడీ సన్నివేశాలతో ఆధ్యాంతం అలరించేలా సాగే ఈ చిత్రం ఇన్నాళ్లు ఎక్కడ ఉందని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు అంటే... ఈ చిత్రం వారి హృదయాలకు ఎంతలా హత్తుకుందో అర్థం చేసుకోవచ్చు. ఇంత అద్భుతమైన సినిమా ఇప్పటికైనా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.




## దేత్తడి ఘనీ భాయ్ మాస్ అప్పీలింగ్ గ్లింప్స్




రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ గ్లింప్స్ లాంచ్ చేశారు.

ఈ గ్లింప్స్ హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పండుగలు, వేడుకలకు ఉత్సాహాన్ని నింపే పాపులర్ డ్రమ్మర్ ఘన్ను భాయ్ వరల్డ్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఘన్ను భాయ్, అతని టీం దాదాపు ఏడు కిలోల డ్రమ్ములను మోస్తూ, గంటల తరబడి విరామం లేకుండా ప్రదర్శన ఇస్తూ ప్రశంసలు అందుకున్నారు. ఆ సంగీతం వెనుకకనిపించే ఆత్మగౌరవం, హుందాతనం ఉన్నాయి. ఈ గ్లింప్స్ ఆ విషయాన్ని ఎంతో సున్నితంగా, శక్తివంతంగా ప్రజెంట్ చేసింది.

## ఇక డిజిటల్ వేట

టాలీవుడ్‌లో వరుస హిట్లు అందుకుంటూ గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ సంయుక్త మీనన్ ఇప్పుడు ఒక సరికొత్త ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు వెండితెరపై తన అందం, అభినయంతో మెప్పించిన ఈ బ్యూటీ, ఇప్పుడు డిజిటల్ ఎంట్రీ ఇవ్వనుంది. ఈమె తన మొదటి వెబ్ సిరీస్‌ను పట్టాలెక్కించి, ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచడానికి రెడీ అయ్యారు. 'గువ్వల చెరువు ఘాట్' పేరుతో తెరకెక్కుతున్న ఒక భారీ వెబ్ సిరీస్‌లో యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అయితే సంయుక్తతో పాటు కిరణ్ అబ్బవరానికి కూడా ఇదే మొదటి ఓటీటీ ప్రాజెక్ట్ కావడం విశేషం. 'డియర్ కామ్రేడ్' ఫేమ్ భరత్ కమ్మ ఈ సిరీస్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు.





## చాన్స్ దక్కించుకున్న కీర్తి సురేష్

నేషనల్ అవార్డు విన్నర్, 'మహానటి' కీర్తి సురేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ పీరియడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో వరుస హిట్లు కొడుతూనే, బాలీవుడ్‌లో కూడా 'రఫ్తార్' వంటి క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు ఖాతాలో మరో భారీ తెలుగు సినిమా వచ్చి చేరినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల 'శంకర్ వరప్రసాద్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి, ఇప్పుడు ఒక భారీ మల్టీస్టారర్ కథను సిద్ధం చేశారు. ఇక ఇందులో విక్టరీ వెంకటేష్ నందమూరి కళ్యాణ్ రామ్ వంటి ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తుండగా.. కీర్తి సురేష్ హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.